5



## అధికారులు సమన్వయంతో పని చేయాలి

- ముఖ్యమైన సమావేశాలకు కూడా కొంత మంది అధికారులు పూర్తి సమాచారంతో రావడం లేదని నిలదీత
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం
- శాఖలవారీగా అధికారులతో సమీక్ష
- అధికారులు అలసత్వం వీడాలి.. ఎంపీ నగేష్
- సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

గురువారం | 10 జూలై 2025 | 16 పేజీలు


14



# పల్లెల్లో 'స్థానిక' సందడి

- పల్లెల్లో మళ్లీ ఎన్నికల కోలాహలం..
- ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషను నోటిఫికేషన్
- గ్రామ పంచాయతీల పరిధి కూడా ఖరారు
- ఉత్తర్వుల జారీతో మొదలైన రాజకీయ సందడి
- ఈ నెల 8 నుంచి 12వ తేదీలోగా ప్రక్రియ పూర్తి
- పట్టణాలు విడిచి గ్రామాల బాటపట్టిన ఆశావహులు
- ఓటర్లకు పలకరింపులు, ఆర్థిక సహాయాలు
- రిజర్వేషన్లలో మార్పు నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ
- 'స్థానిక'పై పోరుపై తగ్గేదే లేదంటున్న యువత..

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

రాజకీయంగా కొన్నాళ్లుగా నిశ్శబ్దంగా ఉన్న పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై మళ్లీ చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పల్లెల్లో ముందుగానే స్థాని కసంస్థల ఎన్నికల వాతావరణం నెలకొంది. ఏ చౌరస్తాల్లో చూసినా ఏ పార్టీ నుంచి ఎవరెవరు బరిలో ఉంటారనే చర్చలు జోరందుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెలాఖరు వరకు విడుదలయ్యే అవకాశాలు ఉండడంతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొన్నది. వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కుల సంఘాల నాయకులను కలుస్తూ మద్దతు ఇవ్వాలని అడుగుతున్నారు. కొన్ని రోజులుగా స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడు, అప్పుడు అంటూ ఊరిస్తూ వస్తుండడంతో అధికార పార్టీకి చెందిన నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఎదురుచూస్తున్నారు. అన్ని పార్టీల్లోనూ స్థానిక సంస్థల్లో టికెట్ల కేటాయింపు ఎలా ఉంటుందనే ఉత్కంఠత నెలకొంది. ఏ క్షణమైనా రిజర్వేషన్ల ఖరారుపై ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆశావహులు పల్లెల్లో ప్రజల ఆదరణ చూరగొనేందుకు తిప్పలు పడుతున్నారు.




## కదంతొక్కిన
# కార్మిక లోకం

- కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై అగ్రహం
- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్..
- వాడ వాడలా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు
- నినాదాలతో దద్దరిల్లిన ప్రధాన చౌరస్తాలు
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సమ్మె సక్సెస్
- కేంద్రం దిగిరాకుంటే సమ్మె తప్పదంటూ హెచ్చరిక
- సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- ఒక్క రోజు సమ్మెతో సంస్థకు రూ.76 కోట్ల నష్టం
- 1.92లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం

కేంద్రం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాలు, ప్రైవేటీకరణ విధానాలపై కార్మికులు కన్నెర్ర చేశారు. శ్రామికుల హక్కులకు గొడ్డలిపెట్టుగా మారిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి.. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్‌తో బుధవారం దేశ వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విజయవంతమైంది. ఆయాచోట్ల వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు ధర్నాలతో హోరెత్తించారు. కేంద్రం దిగి వచ్చి డిమాండ్‌లను నెరవేర్చాలని, లేదంటే నిరవధిక సమ్మెకు దిగుతామంటూ హెచ్చరించారు.

10



## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో..
# ఎడతెరిపి లేని ముసురు వాన

- స్తంభించిన జన జీవనం
- జలకళను సంతరించుకున్న చెరువులు, ప్రాజెక్టులు
- జిల్లా వ్యాప్తంగా 5.7 మి.మీ వర్షపాతం నమోదు
- అత్యధికంగా జైనథ్‌లో 14 మీ.మీ వర్షపాతం
- జలదిగ్బంధంలో కామాయి గ్రామం
- మునిగిన లోవెల్ వంతెన
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఉధృతంగా ప్రాణహిత, పెన్‌గంగ
- భీంసరి, ఆదిలాబాద్ రూరల్ ప్రాంతాల్లో పూర్తిగా నీట మునిగిన పత్తి

## హాల్‌చల్ చేసిన..
# పెద్దపులి రీ ఎంట్రీ

3లో

- కాసిపేట అడువుల్లో మళ్లీ పులి గాండ్రింపులు..
- పెద్దపులి, చిరుత పులుల హల్చల్...
- అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటు



## ప్రసవవేదన..
# ఆరోగ్యరోదన



- పట్టించుకోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది..
- సమ్మెలో ఉన్నామంటూ నిర్లక్ష్య సమాధానం
- మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ఘటన - 4లో

# జిల్లాకు ఎమ్మెల్యేనే రాజు

- ఆ రాజుకు మంత్రుల సహాయం అవసరమైతే చేస్తాం
- ప్రేమ్‌సాగర్ రావుతో ఎటువంటి విభేదాలు లేవు
- ప్రతీ పార్టీలో గ్రూపు రాజకీయాలు సహజం
- కేటీఆర్, కవిత మధ్య గొడవలు లేవా?
- పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ ఎప్పుడైన మంత్రులను కలువనిచ్చడా..
- మా సీఎం రేవంత్ రెడ్డిని ఎప్పుడైన కలవచ్చు..
- విలేకరులతో మంత్రి వివేక్ వెంకటస్వామి

వివరాలు 3లో





# పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

- పోక్సో చట్టం.. అవగాహనే ముఖ్యం
- లైంగిన వేధింపుల నుంచి చిన్నారులకు రక్ష
- నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయండం
- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి పాఠశాల స్థాయిలోనే చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. మండ లాల వారీగా ఎంఈఓలు ప్రతి పాఠశాలలో ఈ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. 2012 లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలలపై లైంగిక నేరాలకు పాల్పడినవారికి కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందని చెప్పారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 10 ఏళ్లు అయినా కూడా ఇంకా సరైన అవగాహన లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులు ఆనందకరమైన బాల్యాన్ని పొందడం వారి హక్కు అన్నారు. లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదివేల మంది విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఈ కేసుల విచారణ వేగంగా పూర్తయ్యేలా చట్టం రూపొందించబడిం దని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నిపుణుడు డేవిడ్ రాజు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం, పాఠశాలల నిర్వ హణ, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు, అధికారులు పోక్సో చట్టంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, వక్తలకు, ఎన్‌సీసీ సభ్యులకు కలెక్టర్ జ్ఞాపికలు అందించి సన్మానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీవాణి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, విద్యాశాఖ అధికారి రామారావు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# హెచ్ఎం మమ్మల్ని టార్చర్ పెడుతున్నాడు





- ఈ హెచ్ఎం మాకు వద్దంటూ రోడ్డెక్కిన విద్యార్థులు
- పీవో వచ్చి సమస్యను పరిష్కరించాలని డిమాండ్
- కోటపల్లి గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో ఘటన

**కోటపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కోటపల్లి మండలంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు బుధవారం ఉదయం రోడ్డెక్కారు. పాఠశాల నుండి బయటకు వచ్చి పీఓ మేడం రావాలి అంటూ నినాదాలు చేస్తూ రోడ్డు మీద కూర్చున్నారు. పాఠశాలలో హెచ్ఎం విద్యార్థుల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతూ విద్యా ర్థులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలుపారు. భోజనం సక్రమంగా పెట్టడం లేదని, ఎవరికీ అయిన చెబితే టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తా అని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం కూడా ఇలాగానే ధర్నా చేద్దాం అని విద్యార్థులు బయటకు రాగా వారిని బుజ్జగించి హెచ్ఎం పాఠశాలకు తీసుక వెళ్లినట్లు తెలిపారు. పాఠశాలను ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడం తోనే విద్యార్థులు రోడ్డెక్కి నట్లు తెలుస్తోంది. హెచ్ఎంపై విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. బాలికల పాఠశాలలో మహిళ హెచ్ ఉంటే విద్యార్థులకు ఇలాంటి ఇబ్బందులు ఉండవు. వెంటనే అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్ఎంను తొలగించి మహిళ హెచ్ఎంను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థులు ధర్నా చేస్తున్న సంఘటన స్థలానికి కోటపల్లి ఎస్ఐ రాజేందర్ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవితకు వినతి

**జన్నారం, జూలై 9 (ప్రభాత సమాచారం)**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాలని బీసీ నాయకులు చేస్తున్న పోరాటానికి తెలంగాణ మాదిగ హక్కుల దండోరా మద్దతు తెలుపుతుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజు అన్నారు. బుధవారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు అయి పోరాటం చేయాలని ఎమ్మెల్సీ కవితను కలిసి వినతి పత్రం అందించారు. బీసీ రిజర్వేషన్లపై ఈనెల 17న జరిగే చలో రైలు రోకో కార్యక్రమానికి మద్దతు తెలుపుతున్నమన్నారు. దండోరా నాయకులు పాల్గొన్నారు.

## తాండూర్ సీఐగా దేవయ్య

**తాండూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ దేవయ్యను తాండూరు సీఐగా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాండూరు సర్కిల్ సీఐగా పని చేస్తున్న కుమార స్వామిని ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మధిర సర్కిల్‌కు బదిలీ చేశారు.




## లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇంటి నెంబర్ల కేటాయింపు

**రామకృష్ణాపూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

తారకరామ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం ఇంటి నంబర్లను కేటాయించారు. ఆర్కేసిఓఏ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో లాటరీ పద్ధతి ద్వారా గతంలో ఎంపిక చేసిన 230 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్ మాట్లాడుతూ... డబుల్ బెడ్ ఇంటి నంబర్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో వికలాంగులకు 13 ఇండ్లను కేటాయించినట్లు తెలిపారు. త్వరలో డబుల్ బెడ్‌రూంలను సంబంధించిన మౌలిక వసతులు పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇంటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని తెలిపారు. కాగా ఇంటి నంబర్లను లబ్ధిదారులకు కేటాయింపు ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు సింగరేణి ఆర్కే సిఓఏ క్లబ్ లో బయటే ఎంపిక చేసిన వారి పత్రాలను పరిశీలించి కేవలం లబ్ధిదారులను మాత్రమే అనుమతించారు. ఈ కార్యక్రమంలో పుర కమిషనర్ గద్దె రాజు, ఏసీపీ రవి, సిఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, ఆర్ఐ గణపతి తదితరులు పాల్గొన్నారు.



## మోడీ పాలనలో దేశం అభివృద్ధి

**నిర్మల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

భారత ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని అదిలాబాద్ ఎంపీ నగేష్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో మామిడా మండలం పొలిటికల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బిజెపిలో చేరగా వారికి కండువాను వేశారు. యువత మోడీ ప్రభుత్వాన్ని కోరుకోవడం వల్లనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే నరేంద్ర రెడ్డి పార్టీ నాయకులు రంజిత్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జింకను కాపాడిన పోలీసులు

**ముథోల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ముథోల్ మండలంలోని బ్రహ్మంన్‌గావ్ గ్రామ శివారులో బుధవారం జింకపై కుక్కలు దాడి చేశాయి. దీంతో స్థానికులు డయల్ 100 ఫోన్ చేయటంతో ముథోల్ ఎస్ఐ బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో పోలిస్ నారీ శక్తి టీం తేజశ్రీ, విజేతలు ఘటన స్థలానికి వెళ్లి జింకను కాపాడారు. ఆనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన జింకను స్థానిక పోలిస్ స్టేషన్‌లో అటవీశాఖ బీట్ ఆఫీసర్ శంకర్‌కు అప్పగించారు. గాయపడిన జింకకు పశువైద్యాధికారి రవిందర్ చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ యశ్వంత్ రావ్, హేడ్ కానిస్టేబుల్‌లు సుభాష్, వెంకటేశ్వర రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# 20 రోజులు హల్‌చల్ చేసిన
# పెద్దపులి రీ ఎంట్రీ

- కాసిపేట అడువుల్లో మళ్లీ గాండ్రింపులు..
- పెద్దపులి, చిరుత పులుల హల్చల్...
- రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు
- అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన..



కాసిపేట, జూలై 9 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో మళ్లీ పెద్ద పులి రీ ఎంట్రీ ఇచ్చింది. గత ఫిబ్రవరిలో 20 రోజుల పాటు పెద్ద పులి కాసిపేట మండలంలో మకాం వేసి హల్చల్ చేసి వెళ్లి పోయింది. మళ్లీ ఇప్పుడు రీ ఎంట్రీ ఇచ్చింది. కాసిపేట మండలంలో పులి గాండ్రింపులతో అలజడి మొదలైంది. కాసిపేట మండలంలోని వెంకటాపూర్, మల్కేపల్లి బీట్ పరిధిలో వెంకటపూర్ గ్రామానికి చెందిన రైతు బుద్దె రాజలింగుకు చెందిన లేగ దూడను పెద్దపులి దాడి చేసి హతమార్చినట్లు బెల్లంపల్లి రేంజర్ సీహెచ్ పూర్ణ చందర్ తెలిపారు. తన లేగ దూడ పులి దాడిలో చనిపోయిందని రైతు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించడం జరిగిందని, ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని మల్కెపల్లి, వెంకటాపూర్ బిట్ల సరిహద్దుల్లో ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందన్నారు. పెద్దపులి అడుగులు కుంట వద్ద వరకు గుర్తించామన్నారు. తిర్యాణి, కాసిపేట మండలాల శివారులో పెద్దపులి సంచరిస్తుంది. వెంకటాపూర్, లక్ష్మీపూర్, ఎగ్గండి, పెద్దగూడ, సోనాపూర్ అటవీ శివారు గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో పెద్ద పులి మకాం వేసినట్లు అధికారులు గుర్తించారు. శివారు గ్రామాల రైతులు పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని, పశువుల కాపరులు అడవిలోకి వెళ్లకుండా, బయట మేపు కోవాలని, అప్రమత్తంగా ఉండాలని ఎవరికైనను పెద్దపులి సమాచారం తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమీప గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, బాధిత రైతుకు నష్టపరిహారం కోసం పై అధికారులకు వివరాలు పంపించినట్లు తెలిపారు.

## పెద్దపులి, చిరుత పులుల హల్చల్...

కాసిపేట మండలంలో అటవీ ప్రాంతంలో పెద్ద పులి, చిరుత పులులు హల్చల్ చేస్తున్నాయి. గతంలో పెద్దపులి ఏకంగా 20 రోజుల పాటు కాసిపేట మండలంలోనే గ్రామాల సమీపంలోనే తిరుగుతూ హంగామా చేసింది. కంటి మీద కునుకు లేకుండా చేసింది. అడవి పందులపై దాడులు చేసింది. ఎవరికీ ఎటువంటి హాని చేయకుండా వెళ్ళిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ పెద్ద పులి తిర్యాణి, కాసిపేట మధ్య అటవీ ప్రాంతాల్లో గ్రామాల శివారు ప్రాంతాల్లో తిరుగుతుండడం, లేగ దూడపై దాడి చేసి చంపడంతో మళ్లీ ఆందోళన పరిస్థితులు మళ్లీ నెలకొన్నాయి. దీంతో పాటు ఇటీవల దేవాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుత పులుల సంచారం విపరీతంగా పెరిగాయి. ముద్దిమాడ, గట్రామ్పల్లి గ్రామాల్లో ఆవుల మందపై దాడులు చేశాయి. నిత్యం చిరుత పులుల సంచారం కొనసాగుతున్నాయి. పెద్దపులి రావడం లేగ దూడను చంపడంతో కాసిపేట మండలంలో ప్రజలు భయందోళన చెందుతున్నారు.

---



# ర్యాగింగ్ నిర్మూలన చట్టంపై
# అవగాహన సదస్సు

### విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల సోదరభావంతో మెలగాలి

లక్షెట్టిపేట, జూలై 9 (ప్రభాత సమాచారం)
మండల న్యాయసేవ సహాయ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కాసమల ఆధ్వర్యంలో మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తోటి విద్యార్థుల పట్ల సోదరభావంతో మెలగాలని కుల, మత, జాతి, వర్గ వివక్షతతో సహచర విద్యార్థుల పట్ల అమానుష చర్యలు లేకుండా వారి మనోభావాలపై తీవ్రప్రభావం పడే విధంగా ప్రవర్తిస్తే చట్టాలు కఠినంగా శిక్షిస్తాయని తెలిపారు. ఇలా జరగకుండా కళాశాలల్లో యుజిసి కమిటీలు ఏర్పాటు చేసి మానిటర్ చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, జనరల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్, సీనియర్ న్యాయవాదులు కారుకూరి సురేందర్, న్యాయవాది పద్మ, ఏఎస్పై, కళాశాల అధ్యాపకులు, మండల న్యాయసేవ సహాయ ఉద్యోగులు నీరజ, యశోద పాల్గొన్నారు.

---

# ట్రిపుల్ ఐటీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి



ముధోల్, జూలై 9 (ప్రభాత సమాచారం)
బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోదండరామ్‌ను తెలంగాణ జన సమితి ముధోల్ ఇంచార్జి సర్దార్ వినోద్ కుమార్, బాసర మాజీ సర్పంచ్ మమ్మయి రమేష్ లు కోరారు. హైదరాబాద్ లోని తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీని బుధవారం కలిసి సన్మానించారు. అనంతరం ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను వివరించారు. పది సంవత్సరాలుగా ట్రిపుల్ ఐటీలో కోట్లాది రూపాయల అవినీతి చోటు చేసుకుందని వారు ఆరోపించారు. విద్యార్థులకు సరైన భోజనంతో పాటు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ట్రిపుల్ ఐటీ సమస్యలపై ఎమ్మెల్సీ స్పందించినట్లు వారు తెలిపారు. సమస్యలపై చర్చించి, సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

---

# ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 77వ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ చౌక్ లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారి వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా భారత మాత, స్వామి వివేకానంద చిత్ర పటాలకు, నేతాజీ విగ్రహానికి పూలమాలను సమర్పించి, ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని తెలిపారు. విద్యార్థులలో జాతీయ భావాలు, దేశభక్తి, సామాజిక స్పృహ వంటి విషయాలలో ఏబీవీపీతోనే సాధ్యమన్నారు. జాతీయవాద సిద్ధాంతం కోసం అమరులైన సుమారు 40 మంది కార్యకర్తల పునాదుల మీద ఏర్పడిన ఏబీవీపీ నేడు దేశంలో ప్రతి కళాశాలకు విస్తరించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నిఖిల్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మహేష్, శ్రీవర్ధన్, సాయి అరుణ్, శివసాయి, పూర్వ కార్యకర్తలు వెంకట్, నాగేందర్ గౌడ్, నిఖిల్, మనోజ్, రవికాంత్ పాల్గొన్నారు.

---



# జిల్లాకు ఎమ్మెల్యేనే రాజు

- ఆ రాజుకు మంత్రుల సహాయం అవసరమైతే చేస్తాం
- ప్రేమ్‌సాగర్ రావుతో ఎటువంటి విభేదాలు లేవు
- ప్రతీ పార్టీలో గ్రూపు రాజకీయాలు సహజం
- కేటీఆర్, కవిత మధ్య గొడవలు లేవా?
- పదేళ్ల పాటు సీఎంగా పని చేసిన కేసీఆర్ ఎప్పుడైన మంత్రులను కలవనిచ్చాడా..
- మా సీఎం రేవంత్‌ని ఎప్పుడైన కలవచ్చు..
- విలేకరులతో మంత్రి వివేక్ వెంకటస్వామి

మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుతో గొడవపైనా మంత్రి వివేక్ స్పందించారు. 'జిల్లాకు ఎమ్మెల్యేనే రాజు.. ఆ రాజుకు మంత్రుల సహాయం అవసరమైతే చేసి పెడతాం' అని వివేక్ క్లారిటీ ఇచ్చారు. ప్రతీ పార్టీలో గొడవలు, గ్రూపు రాజకీయాలు కామన్ అని అన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పార్టీలో గొడవలు ఉన్నాయని తెలిపారు. కేటీఆర్, కవిత మధ్య గొడవలు లేవా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తను మీనాక్షి నటరాజన్ గుర్తిస్తున్నారు.. అందరికీ అవకాశాలు ఇస్తారని అన్నారు. పాత, కొత్త కలుపుకొని పని చేస్తామని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుంది. గిగ్ వర్కర్స్‌కు కనీస వేతనం అందేలా చొరవ తీసుకుంటాం.. గిగ్ వర్కర్స్‌కు అండగా ప్రభుత్వం ఉంది అని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలపై మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత పదేండ్లు మంత్రులతో ప్రజలు మాట్లాడే అవకాశం లేకుండేదని అన్నారు. కానీ.. తమ సీఎం అలా కాదని.. పాశమైలారం ఘటన జరిగిన వెంటనే రేవంత్ రెడ్డి అక్కడకు వెళ్లారని అన్నారు. బాధితులను పరామర్శించారు. వారిలో ధైర్యం నింపారని తెలిపారు. గతంలో కొండగట్టు అంత పెద్ద ఘటన జరిగినా కూడా.. కేసీఆర్ అక్కడికి వెళ్లిన పాపాన పోలేదని విమర్శించారు. పాశమైలారం ఘటన వద్దకు సీఎం వెళ్లినా కూడా కేటీఆర్ వెళ్ళలేదు అనే ప్రచారం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో పోలీసుల పహారా ఉంటుండే.. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు దర్జాగా మంత్రులను కలుస్తున్నారని అన్నారు.

---

# లక్షెట్టిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

లక్షెట్టిపేట, జూలై 9 (ప్రభాత సమాచారం)
మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. బుధవారం పట్టణంలోని నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పర్యవేక్షించి పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ... ఈనెల 13న ప్రారంభించబోయే ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రికి ధీటుగా అన్ని వైద్య సేవలు అందిస్తామని అన్నారు. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దుల శ్రీధర్ బాబు, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో పాటు వివిధ శాఖల మంత్రులు పాల్గొంటారన్నారు. అనంతరం దండేపల్లి మండలంలోని రెబ్బన్పల్లి గ్రామ శివారులో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, మండల అధ్యక్షుడు పెంగిలి రమేష్, ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, డిసిసి ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, ఆర్టిఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, నలిమెల రాజు, దేవేందర్ రెడ్డి, కొత్త వెంకటేశ్వర్లు, వెంకట్ స్వామి గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రసవవేదన..ఆరోణ్య రోదన

■ పట్టించుకోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది.. ■ సమ్మెలో ఉన్నామంటూ నిర్లక్ష్య సమాధానం
■ పురిటి నొప్పులతో కన్నీరు పెట్టుకున్న నిండు గర్భిణీ ■ మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ఘటన

**వేమనపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించేందుకు వెళ్లిన నిండు గర్భిణీకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఎవరు లేకపోవడంతో ప్రసవవేదన తప్పలేదు. పురిటి నొప్పులు భరించలేక ఆమె కుటుంబ సభ్యులు చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ఘటన వేమనపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సభ్యుల వివరాల ప్రకారం మండల కేంద్రంలోని సుఖ ప్రసవం కోసం పుట్టింటికి వచ్చిన నిండు గర్భిణీ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉదయం 8 గంటలకు కొండగోర్ల సోనియా రెండవ కాన్పు ప్రసవం కోసం వెళ్లిన సమయంలో ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఎవరూ లేకపోవడం అటెండర్ కూడా లేకపోవడం విడ్డూరం. ఆస్పత్రిలో బెడ్ పై ఉండి పురిటి నొప్పులు భరించలేక ప్రసవ వేదన భరించలేక తప్పనిసరి పరిస్థితులలో అత్యవసరంగా అంబులెన్స్ ద్వారా చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది ఎవరూ లేకపోవడం పట్ల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో వైద్య సిబ్బంది లేకుండా ఎటు వెళ్లారని




ప్రభుత్వాసుపత్రి వెళితే సుఖప్రసవం జరుగుతుందని వచ్చిన మాకు ప్రసవవేదన తప్పలేదని వైద్య సిబ్బంది పనితీరుపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మారుమూల మండల కేంద్రం లో పనిచేసే వైద్య సిబ్బంది అత్యవసర సమయాల్లో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాల్సిన సిబ్బంది సైతం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా సిబ్బంది లేకపోవడం ఇక ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో సిబ్బంది పనితీరుపై చెప్పనక్కర్లేదు. అక్కడ పనిచేసే వైద్య సిబ్బంది అంతా వారి ఇష్టం ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారు వారికే తెలియదు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన రోగులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షల మారుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలలో సుఖ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ మండల కేంద్రంలో అందుకు భిన్నంగా వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి మారుమూల ప్రాం తాల ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

**సిబ్బంది సమ్మెలో ఉన్నారు : వైద్యాధికారి రాజేష్**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్రంలో ప్రసవానికి వచ్చిన సమయంలో సిబ్బంది ఎవరు లేరని వైద్యాధికారి ఫోన్‌లో సంప్రదించగా సిబ్బంది అంత ఈరోజు సమ్మెలో ఉన్నారని ఆస్పత్రిలో ఎవరు లేరని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

## సమ్మెలో సింగరేణి కార్మికులు

**ఆసిఫాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కేంద్రప్రభుత్వం కార్మిక రంగంపై వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షులు బోగే ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాక్ లను సింగరేణి కేటాయించాలని, కోల్ ఇండియాలో విదేశీ పెట్టుబడులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సింగరేణి సంస్థ వెంటనే లాభాల వాటను ప్రకటించి కార్మికులకు 40 శాతం ఇవ్వాలని సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు, కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.




## లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఇవ్వాలని వినతి



**ముథోల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ముథోల్ మండలంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ లను ఇవ్వాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, యువ నాయకులు రావుల శ్రీనివాస్ లు బుధవారం రోజు నిర్మల్ కలెక్టర్ అభిలాష్ అభినవ్ కలిసి వినతి పత్రం అందజేశారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్ ఆధ్వర్యంలో కలెక్టర్ ను కలిశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాలకు ఇండ్లు మంజూరు చేయాలని వారు కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో భైంసా ఆత్మ కమిటీ చైర్మన్ వివేకానంద, సాయబ్ రావ్ తదిరులు పాల్గొన్నారు.

## వరి నారు మడులను పరిశీలించిన ఏడీఏ

**చెన్నూరు, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండలంలోని సారంగపల్లి గ్రామ శివారులోని వరి నారు మల్లను చెన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు భానోత్ ప్రసాద్ పరిశీలించారు. బుధవారం సారంగపల్లి గ్రామంలోని పలువురు రైతుల పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి మొలక బాగా విచ్చుకున్న తదుపరి ఎత్తుగా తయారు చేసిన బెడ్ల వంటి నారుమలపై పలుచగా చల్లు కొని నారు పెంచుకోవాలని, రెండు నుంచి మూడు ఆకుల దశలో ఎకర నారుమడికి ఒకటి నుంచి రెండు కిలోల డిఏపి, అరకిలో పొటాష్ అందించాలని సూచించారు. వర్షాలు ఎక్కువగా వచ్చినప్పుడు నీరు నిల్వ ఉండి నారు నీటిలో మునిగి కుళ్లి పోకుండా కాలువల ద్వారా నీటిని తీసి వేయాలని, ముఖ్యంగా నారు మల్లలో ఐరన్, జింకు సూక్ష్మ పోషకాల లోపం ఎక్కువగా ఉంటుందని, నివారణకు బాగా చివికిన పశువుల పేడను నారుమడి తయారు చేసుకున్నప్పుడే బురదలో వేసుకోవాలన్నారు. లోప లక్షణాలు కనిపిస్తే సూక్ష్మ పోషకాల మిశ్రమం ఐదు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి వరి నారు పైపాటుగా పిచికారి చేసుకోవాలన్నారు. పురుగు మందుల పిచికారి రూపంలో రైతుకి పెట్టుబడి కూడా తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, ఏఈఓ తిరుపతి రైతులు మనోహర్ రావు, పుల్లారెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.





## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్ నాయక్

**ఖానాపూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ పట్టణంలోని ఏఎంకె ఫంక్షన్ హాలులో జులై 12వ తేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఈ జాబ్ మేళాలో 67 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువకులు జాబ్ మేళాకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పదవ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటిఐ, డిగ్రీ, బిటెక్, ఫార్మాసి, పీజీ చేసినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. జాబ్ మేళాను పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, దీనిని రాజకీయ కోణంలో చూడవద్దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తాళ్ల పెల్లి రాజ గంగన్న, పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, నాయకులు వాల్సింగ్, రాము నాయక్, ప్రదీప్, సుమన్ తదితరులు ఉన్నారు.

## లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాలి

**ఖానాపూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికులు కార్మిక ప్రదర్శన నిర్వహించినారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, పని గంటలు తగ్గించాలని, కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు, తదితర కార్యాలయాల్లో పనిచేసే కార్మికులు పాల్గొన్నారు.



## నానో-డీపీఏ వినియోగంపై అవగాహన

**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులతో కలసి నానో-డీపీఏ వాడకం, ఆవశ్యకతపై కోరమండల్ కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు నానో ఎరువులపై వాడకంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులకు నానో ఎరువుల ఉపయోగం, వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. సాంకేతికత ఆధారిత వ్యవసాయ విధానాలు స్వీకరించాల్సిన అవసరం ఉందని, నానో ఎరువులు మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాక, పంట దిగుబడుల పెంపును కూడా కలుగజేస్తాయని పేర్కొన్నారు. రైతులు ఈ కొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా కోరమండల్ కంపెనీ దక్షిణ మండల అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రోమోర్ నానో డి.ఎ.పి. పంటల ఆధారంగా సాంప్రదాయ డి.ఎ.పి వాడకాన్ని నుండి 1 బస్తా వరకు భర్తీ చేయగల సామర్థ్యం కలిగి ఉంధని, దీని లోని 80శాతం




నానో కణాలు 50 నానో మీటర్ల కన్నా చిన్నవి కావడంతో, ఇవి విస్తృత ఉపరితలాన్ని కవర్ చేయగలవన్నారు. ఈ ద్రవరూప ఎరువు వాడకం ద్వారా వ్యవసాయ రంగంలో ఒక విప్లవాత్మక మార్పు సంభవించనుందని తెలిపారు. కోరమాండెల్ సంస్థ ప్రతినిధులు శిక్షణలో నానో ఎరువుల తయారీ విధానం, వాటి ప్రయోజనాలు, వాడే విధానం వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ కంపెనీ తరఫున సీనియర్ ఏ.వి.పీ. భాస్కర్ రెడ్డి, డా. సుధాకర్ రెడ్డి (డివిజనల్ అగ్రోనమిస్ట్), మాధవన్, నాగరాజు పాల్గొన్నారు. ట్రైనీ కలెక్టర్ సలోని ఛాబ్ర జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

- పథకాల అమలులో పారదర్శకత అవసరం
- అర్హులైన వారికి 'ఉపాధి' జాబ్ కార్డులు ఇవ్వాలి
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- దిశా సమావేశంలో ఎంపీ గోడం నగేష్
- పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

## కేంద్ర ప్రభుత్వ పథకాలను
# సమర్ధవంతంగా అమలు చేయాలి






**నిర్మల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రజలకు సమర్ధవంతంగా అందించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలనీ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశా) సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అవి పూర్తిస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాలనీ స్పష్టం చేశారు. ఆర్టికల్ 275(1), (కంప్రహెన్సివ్ కన్జర్వేషన్ అండ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్), (మిషన్ ఫర్ ప్రొటీన్ చెయిన్) వంటి పథకాల కింద జిల్లాకు వచ్చిన నిధులను సద్వినియోగం చేయాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు. ప్రతి కూలికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ పథకానికి అనుసంధానంగా జిల్లాలో చేపట్టిన రోడ్లు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు, అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించాలనీ, నిధులను సమర్ధవంతంగా వినియోగించి పనులు వేగంగా పూర్తిచేయాలనీ స్పష్టం చేశారు. అన్ని ఇంజినీరింగ్ శాఖలు, ఇతర సంబంధిత శాఖలతో సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అధికారులంతా ప్రతి పనిని స్వయంగా తనిఖీ చేసి, పనులన్నింటినీ పారదర్శకంగా, నాణ్యతతో పూర్తిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రణాళికాబద్ధంగా, సమగ్రంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి అమృత్ 2.0, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన, పీఎం శ్రీ పథకాలకు గుణాత్మకంగా అమలు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలకు త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకానికి జిల్లాలో అర్హత కలిగిన రైతులందరికీ తప్పనిసరిగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, పథకానికి అర్హత కలిగిన ప్రతి రైతుకు లబ్ధి అందేలా వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత తలెత్తకూడదని, వ్యవసాయ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖలో పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని, విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల రుణాలు అర్హులైన ప్రతి ఒక్కరికి సమర్ధవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, విద్య, వైద్య, గిరిజన, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, మున్సిపల్, సంక్షేమ తదితర శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల పురోగతిపై శాఖల వారీగా పథకాలు ఎలా అమలవుతున్నాయో సమీక్షించి, అధికారులకు ఎంపీ అవసరమైన సూచనలు చేశారు. పలువురు శాసనసభ్యులు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రజల వరకు సమర్ధవంతంగా చేరేందుకు అమలు బాధ్యత అధికారులపై ఉన్నదని స్పష్టం చేశారు. అన్ని పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా అమలయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 926 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, ఇందులో 201 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో, 367 ప్రైవేట్ భవనాల్లో, 358 పాఠశాల భవనాల్లో అనుబంధంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. నూతనంగా 36 అంగన్వాడీ భవనాలు నిర్మాణానికి అనుమతులు లభించాయని, ఇప్పటి వరకు 20 భవన నిర్మాణాలు పూర్తీ అయినాయని, మిగితా పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాల్లో 600 మహిళా సంఘాలకు రూ.58 కోట్ల రుణాలు అందించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 130 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, వాటిలో 36 భవనాలకు అనుమ తులు మంజూరు అయినాయని తెలిపారు. ఇప్పటివరకు 10 భవనాల నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు. ఈ భవనాల నిర్మాణానికి 1 కోటి 13 లక్షల నిధులను ఖర్చుచేయడం జరిగిందని వివరించారు. అలాగే జిల్లాలో రూ.47 కోట్ల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అమృత్ 2.0 పథకం కింద 3 నీటి ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు లభించాయని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల్లో బోధన నైపుణ్యాలు మెరుగుపరచడం కోసం 11 పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, 29 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మా ణానికి అనుమతులు లభించినట్లు తెలిపారు. అభివృద్ధిని కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.









## గ్రామపంచాయతీ భవనాన్ని
# ప్రారంభించిన ఎమ్మెల్యే

**మామడ, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మామడ మండలంలోని నల్దుర్తి గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని బుధవారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. 30 లక్షలతో ఈ గ్రామ పంచాయతీని నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# అధికారులు సమాచారం సిద్ధం చేయాలి



**ఆసిఫాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో త్వరలో కేంద్రమంత్రి పర్యటన ఉన్నందున అధికారులు తమ శాఖల పూర్తి సమాచారం సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్‌లతో కలిసి త్వరలో జిల్లాలో పర్యటించనున్న కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి హర్ష మల్హోత్ర కార్యక్రమంపై బుధవారం అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టే పథకాల అమలుపై సమీక్షించనున్నారని చెప్పారు. అస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా ప్రధానమంత్రి జన్‌మన్, ప్రధాన మంత్రి జుగా పథకం అమలుపై అదికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన రెండు రోజుల పాటు జిల్లాలో ఉంటుం దని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై క్షేత్రస్థాయిలో పర్యటనలు ఉంటా యన్నారు. అధికారులు నివేదికలను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందించాలని సూచించారు. అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఎంప్లాయి మెంట్ ఎక్సేంజ్ తెలంగాణ గోడ ప్రతులను అవిష్కరించారు. సమావేశంలో అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన ఎమ్మెల్యే




**కౌటాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథ మిక, ఉన్నత పాఠశాలల్లో బుధవారం వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవాన్ని పండగలాగా నిర్వహించి మొక్కలను కాపాడాల్సిన బాద్యత విద్యార్థులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో నెల కొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, తహసీల్దార్ ప్రమోద్, ఎంపీడీవో రమేష్, ఎంఈవో హనుమంతు, నాయకులు శ్రీశైలం, విజయ్, రాజేందర్, తిరుపతి పాల్గొన్నారు.



## ఉద్యాన, వాణిజ్య పంటల సాగుకు

# రైతులను ప్రోత్సహించాలి

### కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్, జిల్లా ప్రత్యేక అధికారి అజ్మీర ప్రేమ్ సింగ్



**మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)** జిల్లాలో ఉద్యాన, వాణిజ్య పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్, జిల్లా ప్రత్యేక అధికారి అజ్మీర ప్రేమ్ సింగ్ అన్నారు. బుధవారం జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె. అనిత, ఇతర అధికారులతో కలిసి జిల్లాలోని చెన్నూర్ మండలం ఎల్లక్కపేట గ్రామంలోని టస్పార్ ఫామ్,, బేసిక్ సీడ్ మల్టిప్లికేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్, చెన్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆయిల్ ఫామ్ గెలల సేకరణ కేంద్రం, భీమారం మండల కేంద్రంలోని మ్యాట్రిక్స్ ఆయిల్ ఫాం నర్సరీ లను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్ మాట్లాడుతూ ఉద్యాన, వాణిజ్య పంటలను సాగు చేసేలా, సాగు విధివిధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం రైతుల కొరకు అందించే పథకాలను రైతులు పూర్తి స్థాయిలో వినియోగించుకునే విధంగా వివరాలు తెలియచేయాలని, నాణ్యత గల ఆయిల్ ఫామ్ మొక్కలను రైతులకు అందించాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు ఎంతో లాభదాయకమని, జిల్లాలో సాగు విస్తీర్ణాన్ని పెంపొందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. నస్పూర్ మండలం సీతారాంపల్లి గ్రామంలో సోమిశెట్టి రామయ్య అనే రైతు తనకు ఉన్న భూమిలో మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, సొరకాయ, టమాటో ఇతర కూరగాయల రకాల సాగు, ఆయిల్ ఫామ్ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు తాను సాగు చేస్తున్న పంటల వివరాలు అధికారులకు తెలియజేశారు. కూరగాయల సాగుకు 50 శాతం రాయితీ, శాశ్వత పందిరి, మల్చింగ్ సాగుకు 50 శాతం రాయితీ, బిందు సేద్యం పరికరాలపై 90 రాయితీ లభించిందని, తన పంట సాగుకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. అనంతరం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఉద్యాన, వాణిజ్య పంటల సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలని తెలిపారు. ఉద్యాన శాఖ పథకాల లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, పంట సాగులో రైతులకు అవసరమైన మెలకువలను అందించాలని తెలిపారు. కార్యక్రమాలలో పట్టు పరిశ్రమ అధికారి పార్వతి, అధికారులు రావుల తిరుపతి, అరుణ్, సహజ, కళ్యాణి, అర్చన, శాస్త్రవేత్త కిరణ్ కుమార్, మ్యాట్రిక్స్ సంస్థ ప్రతినిధి, బిందు సేద్యం కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మెరుగైన వైద్య సేవలు

# అందించడమే లక్ష్యం

### ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)** నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. బేల మండల కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇటీవల పీహెచ్సీ భవనాన్ని సందర్శించినప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే ఖండించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆలోచించి మాట్లాడాలని హితువు పలికారు. కేంద్ర ప్రభుత్వం కృషితో ఇప్పటికే జిల్లాలో కార్పొరేట్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ, పేషంట్ కేర్ ఆస్పత్రిను ఏర్పాటు చేశామన్నారు. నాయకులు ఇంద్రజిత్, మురళీధర్, రాము, రాకేష్, విజయ్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట గురుకులంలో ఫోన్ మిత్ర ప్రారంభం



**బెల్లంపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ప్రతి గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పని చేసే టెలిఫోన్ బాక్సులు ఏర్పాటు చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిని 2025-26 విద్యా సంవత్సరానికి 268 గురుకులాల్లో ఫోన్ మిత్ర ప్రారంభించారు. దీనిలో భాగంగా బుధవారం కాసిపేట గురుకులంలో ఫోన్ మిత్రాను ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ" అమ్మతో ఒక మాట" అనే ఉద్దేశంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడడానికి ఫోన్ మిత్ర ద్వారా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. దీనికోసం ప్రతి నలుగురు విద్యార్థులకు ఒక కార్డు ఇచ్చామన్నారు. మా గురుకులంలో 6 ఫోన్ మిత్ర బాక్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడడానికి సెక్షన్ వారిగా సమయం కేటాయించామన్నారు. విద్యార్థులకు అందజేసిన కార్డులో రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్ కు మాత్రమే ఫోన్ చేసే అవకాశం ఉంటుందనీ, సొసైటీ లక్ష్యం పిల్లల ఒంటరితనాన్ని దూరం చేసి తల్లిదండ్రులను ఒక ఫోన్ కాల్ దూరంలో ఉండేలా చేసి పిల్లల దృష్టి ఇంటిపైన కాకుండా చదువుపైన కేంద్రీకరించడానికి ఈ సౌకర్యంఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ మిత్ర ఏర్పాటు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



**జైనూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)** రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను జైనూర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావ్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసి అంచెలంచెలుగా రాజకీయ రంగంలో రాణిస్తూ పేదల పక్షపాతిగా నిలిచి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పంద్ర షెక్కు, ఆత్రం భుజంగరావు, సీనియర్ నాయకులు మెస్రం అంబాజీ, వాసీమ్ ఆత్రం శంకర్ రాజా,కనక గంగారం, షేక్ హైదర్ అబ్బు, రహీమ్, తుమ్రం కొటేష్, యాదవ్ రావు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్‌లో సమ్మె సక్సెస్

### కేంద్రం మార్చుకోకపోతే బీజేపీని గద్దెదింపుతాం

### అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)** కేంద్రంలో కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని బీజేపీ పాలనలో నిరుద్యోగం పేదరికం పెరిగిపోయిందని అన్నమొల్ల కిరణ్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భారతదేశ కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకువచ్చిందని అన్నారు. కేంద్రం విధానాలు మార్చుకోకపోతే బీజేపీని గద్దె దింపుతామని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం సమ్మె చేపట్టారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వర్షం పడుతున్న లెక్కచేయకుండా నిరసన తెలిపి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హొరెత్తించారు.

**కార్మిక ద్రోహానికి పాల్పడుతున్న కేంద్రం...**

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు.కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే కార్మికులు కర్షకులు ప్రజల్ని కూడగట్టి గద్దెదింపుతామన్నారు. ఏ ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ప్రా రంభించకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిలో వాటాలను విక్రయిస్తూ కార్పొరేటీకరణ ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. 12 గంటల పని దినాన్ని చట్టబద్ధం చేసి కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు చట్టాలలో మార్పులు చేసిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, టీయూసిఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.దళిత్, బీ జగన్ సింగ్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి బీ.వెంకట్ నారాయణ, ఐఎన్.టీయూసీ జిల్లా నాయకులు షైక్ ఫహీమ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు స్వామి, ఎస్.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు అర్హులకే ఇవ్వాలి



**బెల్లంపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి పట్టణంలో ఇండ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇల్లు అర్హులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో బుధవారం ఆర్డిఓ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. బెల్లంపల్లి పట్టణంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇప్పటికి ఊసే లేదని విమర్శించారు. పట్టాలు కూడా ఏళ్ల తరబడి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళనకారులు అధికారులపై ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అధికారులు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇళ్లపట్టాలు కూడా త్వరితగతిన ఇవ్వాలని కోరారు. అనంతరం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి, పట్టణ ప్రధాన కార్యదర్శి కునిరాజుల అరవింద్, మండల ఇన్చార్జ్ శ్రీనివాస్, రాజయ్య, వడ్నాలస్వామి, జీదుల రాములు, ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు ఎరుకల నర్సింగ్, పట్టణ కోశాధికారి సంతోష అగర్వాల్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



# స్పాంగీ గ్రామస్తుల ధర్నా

**రోడ్డు వేయకపోతే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరిక - రోడ్డుపై బైఠాయించి నిరసన**

**కుభీర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కుభీర్ మండలం సాంగ్వి గ్రామస్థులు, యువకులు బుధవారం తమ సమస్యల సాధనకు రోడ్డెక్కారు. ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి సాంగ్వి గ్రామానికి వెళ్లే రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బైకాట్ చేస్తామని హెచ్చరించారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా తమ గ్రామానికి మొరం రోడ్డు తప్ప బీటీ రోడ్డు వేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి నడవలేని పరిస్థితులు, రోడ్డు గుండా ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేకపోవడం, స్మశాన వాటిక వెళ్లేందుకు దారి లేకపోవడం తదితర సమస్యలు గ్రామస్థులను పట్టి పీడిస్తున్నాయన్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని వెల్లడించారు. అధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడం, ప్రజా ప్రతినిధులు సైతం ముఖం చాటేయంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. సుమారు రెండున్నర గంటల పాటు ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడి అప్రోచ్ రోడ్డును తార్ రోడ్డుగా మార్చాలని, గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో శ్రీనివాస్, హనుమాండ్లు, యోగేష్, విజయ్, నాగన్, వంశీ, రాజు, విట్టల్, వెంకటేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## పట్టా భూముల్లో మొక్కలు నాటడం అన్యాయం

**కాగజ్‌నగర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మండలంలోని మోసం శివారులో ఫారెస్ట్ అధికారులు పట్టా భూముల్లో చెట్లు నాటి రైతులను సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారంటూ బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ-ఫారెస్ట్ శాఖలు జాయింట్ సర్వే చేసి హద్దులు నిర్ణయించకుండానే చెట్లు నాటడాన్ని ఖండించారు. రైతులతో కలసి కలెక్టర్‌ను కలవనున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు

**బెల్లంపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అధికారులు పరిశీలన కార్యక్రమం చేపట్టారు. స్థానిక 13వ వార్డ్ గాంధీ నగర్ ఏరియాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలను బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, డి ఈ సాయి కిరణ్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాలను పరశీలించిన అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అధికారుల వెంట వార్డు ఆఫీసర్ దుర్గయ్య, హౌసింగ్ ఏఈ సాయి ప్రసన్న తదితరులు ఉన్నారు.



# వెల కట్టలేనిది మాతృమూర్తి త్యాగం

**మందమర్రి, జూలై 9 (ప్రభాత సమాచారం)**
అమ్మ భావన విశ్వజనీన మైనదని అమ్మ త్యాగాలు వెల కట్టలేనివని విరసం సభ్యుదు, ప్రముఖ విప్లవ రచయిత అల్లం రాజయ్య అన్నారు. మండలంలోని మామిడి గట్టులో బుధవారం సదాశయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దేహదానం చేసిన మందల అమృతమ్మ సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విప్లవోద్యమం విస్తరించిన తెలంగాణాలో అమృతమ్మ వంటి తల్లులు ఈ కాలంలో నిర్బంధాన్ని, భయాన్ని అనుభవిస్తూ త్యాగలు చేశారన్నారు. ఇటువంటి విప్లవ మూర్తుల త్యాగాన్ని అర్థం చేసుకోవడం తెలంగాణ సమాజం ముందున్న కర్తవ్యం అన్నారు. అమృతమ్మ తన కళ్ళను దానం చేసి ఇతరులకు చూపునిచ్చిందనీ, తన దేహాన్ని దానం చేసి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. బీజేపి క్రమశిక్షణా సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గోనె శ్యాంసుందర్ రావు మాట్లాడుతూ... శ్యామ్ సుందర్ తన తల్లి నేత్రాలు దానం చేయడం అభినందనీయం అన్నారు. ఈ సభలో సదాశ య ఫౌండషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, రవీందర్ రావు, శాత్వాజీ, పౌర హక్కుల సంఘం నేత కుమారస్వామి పాల్గొన్నారు.






## కుభీర్‌లో ఆశా కార్యకర్తల నిరసన

**కుభీర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో బుధవారం ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి ర్యాలీగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అన్నబావుసాటే కూడలిలో మానవ హారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి రావడం ఖాయమని ఆశ వర్కర్లుహెచ్చరించారు. ఆశా వర్కర్ల మండల యూనియన్ అధ్యక్షురాలు సులోచన, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు ఇప్ప లక్ష్మణ్, ఆశ వర్కర్లు లక్ష్మీ పద్మ, కాంత, రేఖ, ఆయా గ్రామాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల ప్రదర్శన

**బెల్లంపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**
సార్వత్రిక సమ్మెలో బెల్లంపల్లి తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు. విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు బుధవారం బెల్లంపల్లి బజారులో ప్రదర్శన చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆర్థిక విధానాలు లేబర్ కోడ్స్ తో రద్దు అయ్యే కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ పిలుపుతో సమ్మెలో పోస్టల్ ఉద్యోగులు, అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాల్గొన్నారు. గ్రామీణ డాక్ సేవక్ మంచిర్యాల బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఉద్యోగులు తపాల కార్యాలయం నుంచి కాంటా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

# రామాలయ అభివృద్ధి తాత్కాలిక కమిటీ ఎన్నిక



**జన్నారం, జూలై 9 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో ఉన్న సీతారామ చంద్రస్వామి ఆలయ ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మన్ మిక్కిలినేని రాజశేఖర్ ప్రతిపాదన మేరకు ఆలయ తాత్కాలిక అభివృద్ధి కమిటిని బుధవారం ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్ గా ఎంఆర్ నర్సింగరావు, సభ్యులుగా గుండ సుధాకర్, మచినేని మోహన రావు, వేగే రామకృష్ణ, రాము, చందులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ .. భూ దాతల, గుడి మొదటి ప్రతిష్టాపనలు, 2003 సంవత్సరంలో జరిగిన పున ప్రతిష్టాపనలు, 2022సంవత్సరంలో జరిగిన పున నిర్మాణం నవగ్రహ, అనుబంధ దేవాలయం ప్రతిష్టపకుల విరాళాల రూపంలో సహాయం అందించిన వ్యక్తులు తగిన ఆధారాలు సమర్పించిన యేడల వారి పేర్లను శిలాఫలకాలపై రాయించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆలయానికి ట్రస్టు చైర్మన్‌గా కొత్తగా సేవలందించడానికి ఎవరైనా ఉంటే వారి పేర్లను తెలపాలన్నారు. అట్టి వ్యక్తులు పోనకల్ గ్రామ వాసియై ఉండి హిందు సాంసృతి సంప్రదాయాలు గౌరవించే వ్యక్తులై ఉండవలేన్నారు. అన్నింటిని పరిగణలోకి తీసుకుని ప్రస్తుత కమిటి మరియు పొనకల్ గ్రామ ప్రజలు, ఆలయానికి విరాళానికి ఇచ్చిన వ్యక్తుల తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయం అని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విలేకరులపై అక్రమ కేసులను ఖండించిన జర్నలిస్టు సంఘాలు

**మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకు వస్తున్న విలేకరులపై కేసులు నమోదు చేయడాన్ని జర్నలిస్టు సంఘాలు వేరువేరుగా ఖండించాయి. అధికారుల పనితీరును ఉన్నతాధికారులకు తెలియజేస్తూ కథనాలు ప్రచురిస్తే కొంతమంది అధికారులు అది జీర్ణించుకోలేక తప్పుడు కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. గతంలో కూడా జిల్లాలో అధికారుల పనితీరుపై వార్తలు రాసిన నేపథ్యంలో ఆ రిపోర్టర్లపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇదే ఆనవాయితీగా కొంతమంది అధికారులు తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న విలేకరులపై వ్యక్తిగతంగా కేసులునమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు మల్లేష్, మధుసూదన్, వెంకటస్వామి, మధు, టీయూడబ్ల్యూజే(143) జిల్లా నాయకులు రేణికుంట్ల శ్రీని వాస్‌లు కలెక్టరేట్ కార్యాలయ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. టియూడబ్ల్యూజె (ఐజేయు) జిల్లా అధ్యక్షులు సత్యం, ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి, డబ్ల్యూజెఐ జిల్లా అధ్యక్షులు పార్వతి సురేష్ కుమార్‌లు వేరువేరు ప్రకటనలలో ఖండించారు.







## మొక్కలు నాటిన ఎంపీడీవో

**కాగజ్‌నగర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండలంలోని లైనుగూడ గ్రామ పంచాయతీని ఎంపిడీఓ కోట ప్రసాద్ బుధవారం సందర్శించారు. పారిశుధ్యాన్ని పరిశీలించిన అనంతరం నర్సరీను పరిశీలించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కార్యదర్శి రాజేశ్వర్‌కి సూచించారు. మారెపల్లి నుంచి లైనుగూడ వరకు రోడ్డుపై ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ మహేష్ పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మకు బోనాలు



**నస్పూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

నస్పూర్ పట్టణం సుందరయ్య కాలనీలో రేణుక ఎల్లమ్మ ఆషాడ బోనాలను కాలనీవాసులు బుధవారం ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర ఆలయం సమీపంలో నుంచి రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు శివసత్తుల పూనకాలు, విన్యాసాలు, నృత్యాలతో బోనాలు ప్రదర్శన సాగింది. రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ




**జన్నారం, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండలంలోని అక్క పల్లి గుడా ప్రభుత్వ పాఠశాలకు బుధవారం కడం గ్రామనికి చెందిన సాయిప్రియ రమణా రావు దంపతుల కుమార్తె ప్రహార జన్మదినాన్ని పురస్కరించుకొని, వాటర్ ప్యూరిఫైయర్ అందించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తోట లచ్చన్న సెక్రెటరీ ఎర్ర ప్రవీణ్, ట్రెజరర్, కామెరా ప్రేమ్ సాగర్, జోన్ చైర్ పర్సన్ కస్తూరి సతీష్ కుమార్ లైన్స్ క్లబ్ సభ్యులు అంజిత్ రావు, అనుముల రాజన్న, పవన్, మల్లేష్, సందీప్, గోలిమణి ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. మంచినీటి సౌకర్యం లభించడం పాఠశాల విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వారు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

**కాగజ్‌నగర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పనులను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిందం శ్రీనివాస్, బాల్క శ్యాం, అరుణ్‌లోయా, గజ్జల లక్ష్మణ్‌బీ శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి - ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

**వాంకిడి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యం శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. బుధవారం మండలంలోని వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠ శాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వంటగది. స్టాక్ రూం. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యల పై ఆరాతీశారు. వానాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకు ముందు లింబుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్టీ పర్పస్ సెంటర్ ను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ.డీటీడీవో రమాదేవితో కలిసి సందర్శించారు. మల్టీ పర్పస్ సెంటర్ లో అవసరమైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానా సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం సేవలు అందించాలన్నారు. ఇందుకోసం రోగులకు అవసరమైన మందులు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రోగులకు అందిస్తున్న వైద్యం సేవలపై ఆరాతీశారు.



## మౌలిక సదుపాయాల కల్పనపై అధికారుల సమీక్ష



**ఆసిఫాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని కొమరం భీం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా మాధ్యమిక అధికారిణి కళ్యా ణి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సౌకర్యాల కోసం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ



### బెజ్జూర్ పీఏసీఎస్ ఎదుట బారులు తీరిన రైతులు

**బెజ్జూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ముందు యూరియా కోసం బుధవారం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. దీంతో కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ కేంద్రంలో బుధవారం పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేపట్టారు. ప్రాథమిక సహకార సంఘంలో యూరియా బస్తాలు సిద్ధంగా ఉన్నప్పటికీ బయోమెట్రిక్ సమస్య తలెత్తడం తో రైతులు గంటలు తరబడి క్యూలైన్ లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఇంచార్జ్ సీఈవో సత్యనారాయ ణ గౌడ్ రైతుల ఆధార్ పట్టా పాస్ పుస్తకం, జిరాక్స్ తీసుకొని రసీదులు అందజేసి యూరియా పంపిని సమయంలో బయోమెట్రిక్ ద్వారా యూరియా అందిస్తున్నట్లు తెలిపారు. అరులైన ప్రతి రైతుకు యూరియా అందించేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, ఏఈవోలు మీనా, మారుతి, శ్రీధర్ సహకార సంఘం సిబ్బంది పర్ష సంజీవ్, దేవాజీ, తదితరులు ఉన్నారు.

## సింగరేణిలో వెలవెలబోయిన గనులు




**తాండూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సింగరేణిలో సమ్మె సైరన్ మోగింది. సింగరేణి కార్మిక సంఘాలైన ఏఐటియుసి, ఐఎన్టియుసి, హెచ్ ఎం ఎస్, టీబీజీకే ఎస్, సిఐటీయు తదితర కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి సింగరేణి వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపుని చ్చాయి. దీంతో బెల్లంపల్లి రీజియన్ లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని మెజార్టీ కార్మికులు సమ్మె వైపు మొగ్గు చూపి విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో కోల్ బెల్ట్‌లోని గనులు, వివిధ విభాగాల కార్యాలయాలు కార్మికులు లేక వెల వెల బోయాయి. అదేవిధంగా బొగ్గు టిప్పర్ల డ్రైవర్ల కూడా సమ్మెలో పాల్గొనడంతో టిప్పర్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సార్వత్రిక సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని సింగరేణి యాజమాన్యం, సూచించారు. అయినా కార్మికులు సమ్మె వైపే మొగ్గు చూపారు. దీంతో కార్మిక సంఘాల నాయకులు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.



## ముధోల్‌లో రాస్తారోకో

**ముథోల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నియోజకవర్గం కేంద్రమైన ముధోల్ లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, ఆశ, అంగన్ వాడీ కార్యకర్తలు, సమ్మెలో పాల్గొని రాస్తారోకోకు దిగారు. మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు వచ్చి ఐబి దగ్గర సమావేశం నిర్వహించారు. ఆనంతరం స్థానిక ఐబీ నుండి ర్యాలీగా వెళ్లి నయబాది చౌరస్తాలో కొద్ది సేపు రాస్తారోకో నిర్వహించారు. ఆనంతరం సిఐటియు నిర్మల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పోశెట్టి మాట్లాడుతూ కొత్త లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లకు కనీసం వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు.కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, పేన్షన్ హక్కు లను కల్పించాలని ఆయన పేర్కొన్నారు. పనిగంటల పెంపును నిరోధించాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లింగన్న, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు రేష్మా, ఆరిసియా, విజయ లక్ష్మి, సుజాత, రమా, భూమన్న పాల్గొన్నారు.

## జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా నిలవాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోతిరే

**ఆసిఫాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారదులుగా నిలవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. నూతనంగా ఎన్నికైన ఆసిఫాబాద్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గ సభ్యులు బుధవారం కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లాలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయికుమార్, సదాశివ్, కోశాధికారి చరణ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.





## సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి కల్పిత కథతో..

'హరి హర వీరమల్లు'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్ . ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 24న థియేటర్లలోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వాన్ని వేగవంతం చేసింది చిత్ర బృందం. అయితే ఈ చిత్రం తెలంగాణకు చెందిన ఓ వీరుడి కథ ఆధారంగా రూపొందినట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం స్పందించింది. ఆ ప్రచారంలో వాస్తవం లేదని తెలిపింది. "ఇది నిజజీవితంలోని ఏ ఒక్క నాయకుడి కథ ఆధారంగానూ తెరకెక్కలేదు. సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి ప్రయాణాన్ని తెలిపే కల్పిత కథగా దీన్ని రూపొందించాం. ఈ సినిమాలో పవన్ పాత్ర శివుడు, విష్ణువుల అవతారంలా ఉంటుంది. అందుకే ఆ లక్షణాల్ని ప్రతిబింబించేలాగే 'హరి (విష్ణువు) హర (శివుడు) వీరమల్లు' అనే టైటిల్‌ను ఖరారు చేశాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.



## అదొక టాక్సిక్ రిలేషన్‌షిప్‌లా ఫీలయ్యా



మానసిక, శారీరక ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై 'టేక్ 20 హెల్త్' వేదికగా అవగాహన కల్పిస్తున్నారు నటి సమంత ఆయా రంగాలకు చెందిన నిపుణులను ఇంటర్వ్యూ చేయడమే కాకుండా తన జీవితానికి సంబంధించిన పలు అంశాలనూ అందులో పంచుకుంటున్నారు. ఈక్రమంలోనే కొన్నిరోజుల క్రితం 'బయోహ్యాకింగ్'పై జరిగిన చిట్‌చాట్‌లో సమంత ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. ఒకానొక సమయంలో మొబైల్‌కు తాను ఎంతగా ఎడిక్ట్ అయ్యారో చెప్పారు. ఫోన్ లేకుండా తాను ఉండలేకపోయేదానినని తెలిపారు. అదొక టాక్సిక్ రిలేషన్‌షిప్‌లా ఫీలయ్యానన్నారు. ఆ అలవాటును తాను ఏవిధంగా అధిగమించారో వెల్లడించారు. "వ్యక్తిగత జీవితానికి సంబంధించి నేను ఎన్నో మార్పులు చేసుకున్నాను. నాకంటూ ఒక ప్రత్యేకమైన రొటీన్ ఏర్పాటుచేసుకుని.. దానిని ఫాలో అవుతున్నా. అందుకు సంతోషంగా ఉన్నా. ఫోన్ విషయంలో మాత్రం తొలుత నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయా. ఫోన్ వాడకానికి బాగా అలవాటు పడ్డా. ఒకానొక సమయంలో ఇది కరెక్టేనా అని నన్ను నేను ప్రశ్నించుకున్నా. ఆ అలవాటు నుంచి బయటపడేందుకు డిజిటల్ డిటాక్స్ ఫాలో అయ్యా. ఎవరితోనూ మాట్లాడకుండా, ఫోన్ చూడకుండా, ఇతరులను కలవకుండా.. ఇలా సుమారు మూడు రోజులపాటు ఉండాలని నిర్ణయించుకున్నా. అలా కొన్నిరోజులపాటు పాటించిన తర్వాత ఎంతో మారా" అని సమంత తెలిపారు. సమంత ప్రస్తుతం నటిగానే కాకుండా నిర్మాత, వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. 'సాకి' దుస్తుల బ్రాండ్‌తోపాటు సీక్రెట్ ఆల్కమిస్ట్ అనే బ్యూటీ, కాస్మొటిక్స్, పర్సనల్ కేర్ సంస్థ సహ వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.

## ట్రయథ్లాన్‌లో సత్తా చాటిన సయామీ



హీరోయిన్లు తమ నటనతో ప్రేక్షకులను అలరించడమే కాకుండా అప్పుడప్పుడూ వ్యక్తిగత అభిరుచులను కూడా పంచుకుంటూ అభిమానులను ఆశ్చర్యపరుస్తుంటారు. అలానే కొందరు నాయికలు ఇతర రంగాల్లోనూ ప్రతిభని కనబరుస్తుంటారు. వీరిలో నటి సయామీ ఖేర్ ఒకరు. 'రేయ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈమె ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. ఆమె విదేశాల్లో నిర్వహించే ట్రయథ్లాన్ పోటీలలో పాల్గొంటుంటారు. ఏడాది వ్యవధిలో రెండు సార్లు 'ఐరన్‌మ్యాన్ 70.3' పూర్తి చేసిన తొలి భారతీయ నటిగా ఆమె రికార్డు సృష్టించారు. గతేడాది సెప్టెంబరులో తొలి మెడల్‌ని అందుకున్న ఆమె..ఇప్పుడు స్వీడన్‌లో నిర్వహించిన రేస్‌లో గెలిచి మరో పతకం అందుకున్నారు. 1.9 కి.మీ ఈత, 90 కి.మీ.సైక్లింగ్, 21.1 కి.మీ. పరుగు అనేవి ట్రయథ్లాన్‌లో భాగం.అత్యంత కష్టమైన పోటీల్లో ఇదొకటి. ఈ విజయాన్ని ఇన్‌స్టా వేదికగా పంచుకుంది సయామీ ఖేర్. "ఎంతో ఆనందంగా ఉంది. క్రమశిక్షణతో ఏదైనా సాధ్యమే. అది సాకులను అధిగమిస్తుంది. ప్రపంచానికి నేనేంటో నిరూపించుకోవాలన్న ఉద్దేశంతో ఇదంతా చేయలేదు. నా మనసుకి నచ్చింది చేస్తున్నాను. నా ఏకైక లక్ష్యం గత సంవత్సరం కంటే మెరుగ్గా ఉండటమే. గతేడాది రేస్ కంటే ఈ ఏడాది రేస్‌ను 32 నిమిషాల కంటే ముందే పూర్తి చేశాను. ఒకప్పుడు సాధ్యం కాదనిపించిన పనిని పూర్తి చేయడం వర్ణించలేనంత సంతృప్తినిస్తుంద"ని ఓ పోస్ట్‌లో రాసింది. పలు బాలీవుడ్ చిత్రాలతో అలరించిన ఆమె 'స్పెషల్ ఓపీఎస్2' సిరీస్‌తో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## భాగ్యశ్రీ అందుకు వెయిటింగ్..?

మిస్టర్ బచ్చన్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన భాగ్య శ్రీ బోర్స్ ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంది. విజయ్ కింగ్ డం తో పాటు రామ్ తో ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాలో నటిస్తున్న భాగ్య శ్రీ ఈ రెండు సినిమాలతో తెలుగులో పాపులారిటీ సంపాదించాలని చూస్తుంది. విజయ్ దేవరకొండ కింగ్ డమ్ సినిమా ఈ నెల చివరన రిలీజ్ అవుతుంది. ఈ సినిమా పై అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది.గౌతం తిన్ననూరి డైరెక్షన్ లో తెరకెక్కిన కింగ్ డమ్ సినిమాలో భాగ్య శ్రీ రోల్ కూడా ఇంప్రెస్ చేస్తుందని అంటున్నారు. సినిమాలో ఆమె విజయ్ గర్ల్ ఫ్రెండ్ గా కనిపిస్తుంది. ఇప్పటికే సినిమా నుంచి వచ్చిన హృదయం లోపల సాంగ్ సూపర్ హిట్ అయ్యింది. అంతేకాదు విజయ్ తో భాగ్య శ్రీ లిప్ లాక్ కూడా సూపర్ హిట్ అయ్యింది. భాగ్య శ్రీ తెలుగులో చేసిన తొలి సినిమా మిస్టర్ బచ్చన్ నిరాశపరచింది.ఆ సినిమా ఫ్లాపైనా అమ్మడికి అవకాశాలు వెల్లువలా వచ్చాయి. ఐతే టాలీవుడ్ లో తొలి హిట్ కోసం ఎంతో ఆసక్తిగా ఉంది భాగ్య శ్రీ. అది విజయ్ కింగ్ డమ్ తోనే సాధించాలని చూస్తుంది. కింగ్ డమ్ ప్రమోషనల్ కంటెంట్ చూస్తే తప్పకుండా హిట్టు పడేలా ఉంది. ఐతే ఈ సినిమాతో నిజంగానే హిట్టు పడితే భాగ్య శ్రీ రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది. కింగ్ డం మాత్రమే కాదు రామ్ సినిమాతో కూడా భాగ్య శ్రీ యూత్ ఆడియన్స్ కి మరింత దగ్గర కానుంది. ఈ రెండు సినిమాలు అనుకున్న రేంజ్ సక్సెస్ పడితే భాగ్యానికి ఇక తిరుగు ఉండదని చెప్పొచ్చు. భాగ్య శ్రీ మాత్రం ఈ సినిమాల మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. సినిమాల్లో యాక్టింగ్ తో పాటు గ్లామర్ విషయంలో కూడా వెనక్కి తగ్గని భాగ్య శ్రీ కింగ్ డమ్, ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాల్లో గ్లామర్ షోతో కూడా అలరిస్తుందని తెలుస్తుంది. హిట్టు పడకపోతేనే అమ్మడు ఈ రేంజ్ ఫాం కొనసాగిస్తుంటే ఇక సూపర్ హిట్ పడితే మాత్రం భాగ్య శ్రీ పంట పడినట్టే అని చెప్పొచ్చు.



# సింగరేణిలో సమ్మె సైరన్

- సార్వత్రిక సమ్మెకు సకలజనులూ మద్దతు
- నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి
- చట్టాల రద్దుపై నిరసన గళం
- సార్వత్రిక సమ్మెకు బీఎంఎస్ దూరం

**బెల్లంపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా తలపెట్టిన సార్వత్రిక సింగరేణి సమ్మె సక్సెస్ అయింది. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సింగరేణిలో బుధవారం గనులు డిపార్టెంట్లు బందు చేసి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కేంద్రం తీసుకువస్తున్న నూతన లేబర్ కోడ్, కనీస వేతనాల పెంపు,ప్రైవేటీకరణ నిర్ణయాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు ఈ రోజు పిలుపునిచ్చాయి. ఈ పిలుపుకు స్పందించి సింగరేణిలో కార్మికులు స్పందించారు.ఫలితంగా భారీ ఎత్తున బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. అత్యవసర సిబ్బంది తప్ప అన్ని విభాగాల కార్మికులు, ఉద్యోగులు సమ్మెకు సంఘీభావంగా విధులు బహిష్కరించారు. ఒకరోజు సమ్మె ఫలితంగా మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని శాంతిఖనిలో 8 వందల టన్నులు, కాసిపేట 6వందలు, కాసిపేట 2లో 650 టన్నుల బొగ్గు ఉత్పత్తి స్తంభించింది. అండర్ గ్రౌండ్ గనులతో పాటు కైరగూడ ఓసీలో 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మందమర్రి, గోలేటి ఏరియాలో సమ్మె సైరన్ మోగింది. భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ లు, డిపార్టెమెంటుల్లో పనిచేస్తున్న కార్మికులు సైతం సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ఎక్కడికి అక్కడ సింగరేణి కార్యకలాపాలు నిలిచిపోయాయి. సింగరేణిలో సమ్మె ప్రభావం తీవ్రంగా కనిపించింది. కార్మిక చట్టాల రద్దుపై సింగరేణి కార్మిక లోకం సమ్మె చేసి తమ వ్యతిరేకతను ప్రకటించింది. సింగరేణిలో జాతీయ సంఘాలు జేఏసీగా ఏర్పడి సార్వత్రిక సమ్మెకు సింగరేణిలో పిలుపునిచ్చారు. జేఏసీలో ఏఐటీయూసీ, ఐఎన్టీ యూసీ,టీబీజీకేఎస్, సీఐటీయూ, ఐఎఫ్ టీయూ, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘంతో పాటు అన్ని సంఘాలు ఏకమయ్యాయి. సింగరేణి కార్మిక లోకం సమ్మెకు సానుకూలంగా స్పందించారు. సింగరేణిలో సార్వత్రిక సమ్మెను దిగ్విజయం చేసింది.

**సమ్మెకు బీఎంఎస్ దూరం..**

సింగరేణిలో సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మిక సంఘం బీఎంఎస్ దూరంగా ఉంది. కార్మిక సంఘం పేరిట సింగరేణి పనిచేస్తున్న ఆ సంఘం సమ్మెకు దూరంగా ఉండడం పట్ల విమర్శలను మూటగట్టుకుంది. కార్మికుల హక్కులకు విఘాతం కలిగించే కొత్త లేబర్ కోడ్ తీసుకువస్తున్నకేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన మొదలైంది. దాని కొనసాగింపులో భాగంగానే సార్వత్రిక సమ్మె. ఈ సమ్మెను సింగరేణిలో అన్ని ప్రధాన కార్మిక సంఘాలు తమ భుజస్కందాలపై వేసుకున్నాయి. కానీ బిఎంఎస్ మాత్రం కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక నిర్ణయానికి మద్దతుగా నిలిచిందని జేఏసీ కార్మిక సంఘాలు మొదటి నుంచీ ఎండగడుతూ వచ్చాయి. సమ్మెకు దూరంగా ఉండడం కార్మిక ద్రోహిమే అవుతుందని ఆ సంఘం విధాన నిర్ణయం పై సింగరేణిలో కార్మికుల నుంచి వ్యతిరేకత పెల్లుబికింది. అయినప్పటికీ బిఎంఎస్ తన నిర్ణయాన్ని పున: పరిశీలన చేసుకోకపోగా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలపై తీసుకున్న నిర్ణయానికి వత్తాసు పలకడం సింగరేణిలో తీవ్ర విమర్శలను కొనితెచ్చుకుంది. సింగరేణిలో కార్మికులు హక్కుల పరిరక్షణ కోసం సమ్మెతో కదం తొక్కారు. సార్వత్రిక సమ్మె సింగరేణిలో జేఏసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫలప్రదం అయింది.

# ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేని ముసురు



- స్తంభించిన జన జీవనం
- జలకళను సంతరించుకున్న చెరువులు, ప్రాజెక్టులు
- జిల్లా వ్యాప్తంగా 5.7 మి.మీ వర్షపాతం నమోదు
- అత్యధికంగా జైనథ్‌లో 14 మీ.మీ వర్షపాతం

**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కుంభవృష్టి వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజుల క్రితం ప్రారంభమైన వానలు ఏక ధాటిగా కురుస్తుండడంతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. బుధవారం సైతం భారీ వర్షాలు కురిశాయి. 24 గంటల వ్యవధిలో అన్ని మండలాలను కలుపుకుని సరా సరి 5.7 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జైనథ్ మండలంలో 14 మీ.మీ వర్షపాతం నమోదైంది. మహారాష్ట్రలోనూ కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దిగు వన ఉన్న ప్రాజెక్టులు, చెరువులు జలకలను సంతరించు కుంటున్నాయి. ఇక భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం అప్రమత్తమయింది.క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారి చేస్తున్నారు.భారీ వర్షాలు కురుస్తుండడంతో పట్టణంలోని ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసరమైన పనులు ఉన్నవారు రెయిన్ కోట్లు ధరించి బయటకు వస్తున్నారు.వర్షం భారీగా ఉన్నప్పుడు పొలాలలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకవద్దని అధి కార యంత్రాంగం సూచిస్తోంది. చెరువులు, కుంటలు, అలుగులు దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకలు దగ్గర నీటి ప్రవాహం ఉన్న చోట అప్ర మత్తంగా ఉండాలని చెబుతున్నారు. ఇదిలా ఉంటె జిల్లా సరిహద్దున ఉన్న పెన్ గంగ నది ఉధృతంగా ప్రవహి స్తోంది. మహారాష్ట్ర నుండి వస్తున్న భారీ వరద నీటితో వాగు ప్రవాహం భారిగా పెరిగింది. దీంతో నది పరివాహక ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్ గంగ నది దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మత్తడి వాగు ప్రాజెక్ట్‌లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాలి

**నిర్మల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

దేశంలో అసంఘటిత కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనం చేసి నాలుగు లేబర్ కోడ్ చట్టాలను తీసుకురావడం జరిగిందని సిఐటియు జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆశ వర్కర్లు అంగన్వాడీలు మున్సిపల్ కార్మికులు గ్రామపంచాయతీ వర్కర్లు 108 ఉద్యోగులు మున్సిపల్ ఉద్యోగులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికులకు




హాని కలిగించే లేబర్ కోడ్ చట్టాలను ప్రభుత్వం రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ సుజాత గంగామణి ఇంద్రమాల రామా పద్మ రాజశేఖర్ లింగన్న పాల్గొన్నారు.




# కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి

**జన్నారం, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నశించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కూకటికారి బుచ్చయ్య మండలా కన్వీనర్ అంబటి లక్ష్మణ్ అన్నారు. బుధవారం దేశవ్యాప్త సారవత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ, సీపీఐ(ఎం) అంగన్వాడీ వర్కర్స్ ఆ శాఖ వర్కర్స్ మధ్యాహ్న భోజన కార్మికులు చేతి వృత్తిదారులు టైలర్స్ అసోసియేషన్ కెవిపిఎస్ డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల నాయకులతో స్థానిక బస్టాండ్ నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ రామ్మోహన్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల అర్షకులపై అవలంబిస్తున్న నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కొండ గొర్ల లింగన్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోతు విజయశంకర్ మహిళలు గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సమ్మె విజయవంతం



**మందమర్రి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మికుల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను యధాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సింగరేణిలో విజయవంతం అయింది. జాతీయ కార్మిక సంఘాలు కార్మిక హక్కులు, చట్టాల పరిరక్షణ కోరుతూ ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె బుధవారం సింగరేణిలో పూర్తిస్థాయిలో విజయవంతం అయింది. సింగరేణి విస్తరించి ఉన్న ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా స్తంభించింది. సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయుసీతో పాటు అన్ని జాతీయ, ప్రాంతీయ కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పాటై సమ్మె ఆవశ్యకతపై గత పది రోజులుగా గనులు డిపార్టెంట్ల వారీగా గేట్ మీటింగ్ లు నిర్వహిస్తూ కార్మిక చట్టాల మార్పు వల్ల కలిగే నష్టాలను కార్మికులకు వివరిస్తూ, కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కుల పరిరక్షణకు సమ్మె ఆయుధ మని, సమ్మె ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కార్మికులకు వివరించడంతో మెజారిటీ కార్మికులు సమ్మెకు సన్నద్ధమై సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించి స్వచ్ఛందం గా సమ్మెలో పాల్గొనీ తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి వ్యక్తం చేశారు. సింగరేణి వ్యాప్తంగా భూగర్భ ఉపరితలంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులతో పాటు, కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెకు మద్దతు ప్రకటించి

**సమ్మెతో నిర్మానుష్యంగా మారిన గని ప్రాంగణాలు..**
**సమ్మెకు మద్దతుగా కార్మిక సంఘాల ఆందోళనలు**

సమ్మెలో పాల్గొనడంతో సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా పూర్తిగా నిలిచిపోయింది. కార్మికుల సమ్మెతో నిత్యం కళకళలాడే కోల్బెల్టు రహదారులు కార్మికుల సందడి లేక నిర్మానుష్యంగా మారాయి.

**సమ్మె సంపూర్ణం...**

జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనడంతో సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్ల లో సమ్మె విజయ వంతం అయింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం నుంచి 1, 2 ,3 , భూపాలపల్లి కొత్తగూడెం మణుగూరు ఇల్లందు ఏరియాలలోని కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనడంతో సింగరేణి వ్యాప్తంగా 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి స్తంభించి సుమారు 76 కోట్ల నష్టం వాటిల్లగా, కార్మికులు 13.07 కోట్లు వేతన రూపంలో నష్టపోయారు.

**బోసిపోయిన గని ప్రాంగణాలు...**

సింగరేణి కార్మికులతో నిత్యం కళకళలాడే బొగ్గు గనులు దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెకు మద్దతుగా నిలవడంతో సింగరేణిలోని బొగ్గు గనులు కార్మికుల సందడి లేక నిర్మానుష్యంగా మారాయి. సమ్మె మూలంగా బోసిపోయి దర్శనమిచ్చాయి. గనుల్లో అత్యవసర కార్మికులు మినహా మిగతా కార్మికులు విధులకు హాజరు కాక పోవడంతో సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచి పోయింది.

**సమ్మెకు మద్దతుగా ఆందోళనలు...**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెకు మద్దతుగా సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరస నలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. బెల్లంపల్లిలో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మందమర్రిలో సిఐటియు ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టగా, ఏఐటియుసి ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం నుండి మార్కెట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ జయశంకర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. శ్రీరాంపూర్‌లో సమ్మెకు మద్దతుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా చేపట్టి లేబర్ కోడ్ ల దిష్టి బొమ్మను దహనం చేశారు, మంచిర్యాల జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. రామగుండం 1, 2, 3 డివిజన్లలో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మానవహారం, ధర్నా నిర్వహించారు. భూపాలపల్లిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన చేపట్టారు. కొత్తగూడెం ఇల్లందు మణుగూరు ఏరియాలలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టారు. కార్మిక సంఘాల ఆందోళనలతో సింగరేణి వ్యాప్తంగా మోడీ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నినాదాలతో మారుమోగింది.



### ట్రాక్టర్ డ్రైవర్ మృతి..

## కుటుంబ సభ్యుల ధర్నా

**రెబ్బెన, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో గత వారం రోజుల క్రితం ట్రాక్టర్ బోల్తా పడి ట్రాక్టర్ డ్రైవర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా.. వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు ట్రాక్టర్ డ్రైవర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. దీంతో రహదారికి ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

## మద్యం సేవించి ఒకరు మృతి

**మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల చున్నంబట్టి వాడకి చెందిన ఆసం కిషన్ (36) అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ బుధవారం తెలిపారు. మద్యం సేవించి వచ్చిన ఆయన ఇంట్లో మెట్ల పైన పడుకున్నాడు. కిషన్ తల్లి లక్ష్మి వచ్చి ఎంత పిలిచినా పలకకపోవడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

**భీమారం, జూలై 9 (ప్రభాత సమాచారం)**

భీమారం మండలంలోని కాజిపల్లికి చెందిన జాగేటి రామచందర్ (51) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్వేత బుధవారం తెలిపారు. కూలీ పనులు చేసుకుంటూనే గత ఏడాది భూమి కౌలుకు తీసుకొని అప్పుచేసి పత్తి సాగు చేశాడు. దిగుబడి రాక అప్పులు పెరగడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వెల్లడించారు.

## హత్య కేసులో ఐదుగురి అరెస్టు

**వాంకిడి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండలంలోని నౌధరి గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి హత్య కేసులో అదే గ్రామానికి చెందిన ఐదుగురి మంగళవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్ కు పంపించి నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జనవరి 29న పూసం కేశవరావు. మండోరే మహేష్. మాడావి భీంరావ్. అర్క రమేష్. పెద్దపూరాకు చెందిన భీం రావ్ లు కలిసి ఆత్రం తిరుపతి ఇంటికి వెళ్లి. అటవీ జంతువుల వేటకు అని.. ఆరుగురు కలిసి గ్రామ సమీపంలోని అటవీ కి వెళ్లారు. జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చే క్రమంలోనే ఆత్రం తిరుపతికి విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. అయితే ఈ విషయం బయటికి వస్తే తమకు శిక్ష పడుతుందన్న భయం సదరు వ్యక్తులు తిరుపతి మృతదే హాన్ని శివారులోని అటవీ ప్రాంతంలో తీసుకెళ్లి పడేసి. ఇంటికి తిరిగి వచ్చారు. తిరుపతి ఇంటికి రావడంతో భార్య సంగీత పూసం కేశవరావు వెళ్లి అడుగగా తనకు తెలియదని చెప్పాడు. దీంతో అతని ఆచూకీ కోసం గాలిస్తున్న క్రమంలో జనవరి 31న తిరుపతి మృతదేహాన్ని పేవుట అటవీ ప్రాంతంలో గుర్తించి.. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరి పారు. ఈ క్రమంలోనే ఈ నెల 3న గురువారం వారాంతపు సంతకు వచ్చిన మృతుడు తిరుపతి మేనల్లుడైన చిత్రం ప్రకాష్. అదే గ్రామానికి చెందిన దుర్వ జంగు కలిసి మీ మామా ఎలా చనిపో యాడో.. మీకు తెలుసా... నాకు తెలుసు.. అటవీ జంతు వులకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడని చెప్పారు. దీంతో పూసం కేశవరావుని నిలదీస్తే అసలు విషయం చెప్పాడు. మృతుడి భార్య సంగీత ఇచ్చిన ఫిర్యాదుతో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# నకిలి పత్రాలు సృష్టించిన ప్రభుత్వ టీచర్ అరెస్ట్



**- నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు పాల్పడిన ప్రభుత్వ టీచర్**

**- టీచర్‌తో పాటు ఐదుగురి - వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని 68/54 సర్వే నెంబంర్‌లో ఖాళీ ప్లాట్లను చూపించి నకిలీ పత్రాలతో అక్రమంగా అంటగట్టి రూ. 23లక్షలు కాజేసిన భూ మాఫియా కేసులో బుధవారం రూరల్ పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి ఇతరుల ప్లాట్లను తమవేనంటూ నమ్మబలికి మోసం చేయగా బాధితులు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించగా కేసు విచారణలో నిందితులు అక్రమాలతో రూ. 23 లక్షలు మోసం చేసినట్లు తేలింది. ఆదిలాబాద్ పట్టణంలోని వికలాంగుల కాలనీకి చెందిన కోర్టు రిటైర్డ్ ఉద్యోగి ఆరెవార్ రాజన్న పోలీసుస్టేషన్లో రాతపూర్వకంగా ఫిర్యాదు అందించారు. 2023లో దాసరి జ్యోతి, గుగులోత్ బాపురావ్ అనే ఇద్దరు వ్యక్తులు తక్కువ ధరకు ప్లాట్లు విక్రయిస్తామని చెప్పి సర్వే నెంబర్ 68/54/4 లోని ప్లాట్ నెంబర్లు 28, 29, 30,65 చూపించి బాధితులకు అంటగట్టారు. వారి వద్ద నుండి అక్రమపత్రాలు 23లక్షలు వసూలు చేశారు. ఈకేసులో అక్రమ పత్రాలు బయట పడటంతో భూమాఫియా చేసిన నిందితులు దాసరి జ్యోతి, గుగులోత్ బాపురావ్ (టీచర్), శ్రీనివాస్, పాలెపు శ్రీనివాస్, భూమన్నలను డిఎస్పీజీవన్ రెడ్డి అరెస్టు చేశారు. అయితే వీరిలో గుగులోత్ బాపురావ్ భార్య, నిందితురాలు గుగు లోత్ అంబిక అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నామని డిఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.

## వన్య ప్రాణుల కోసం పెట్టిన విద్యుత్ తీగలు తగలి వ్యక్తి మృతి



**వాంకిడి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

అటవీ జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదయ్యింది. ఈ విషయాన్ని ఆదిలాబాద్ జిల్లా వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి 29న నవేధారి గ్రామానికి చెందిన పూసం కేశవరావు, మండోరె బుర్సా, మాడావి భీమ్రావు, రాంపూర్ గ్రామానికి చెందిన అర్క రమేష్, పెద్ద పుల్లార గ్రామానికి చెందిన మడావి భీం రావులు విద్యుత్ తీగలు అమర్చి వన్య ప్రాణులను హతమార్చేందుకు ఆత్రం తిరుపతిని అటవీకి వెంట తీసుకెళ్లారు. తీగలు అమర్చే సమయంలో కరెంట్ షాక్‌తో తిరుపతి మృతి చెందాడు. ఈ విషయాన్ని బయటికి పొక్కకుండా దాచిపెట్టారు. రెండు రోజుల తర్వాత జనవరి 31న గ్రామ సమీపంలోని గుట్టపై శవమై కనిపించాడు. మామూలుగా మృతి చెంది ఉంటాడని అనుకుని కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నేర్పించారు. అయితే, గ్రామానికి చెందిన పలువురు అమర్చిన విద్యుత్ తీగలు తగలడం వల్లే తిరుపతి మరణించాడని ఈ నెల 3వ తేదీన గ్రామస్థులు చర్చించుకోవడంతో ఈ విషయం మృతుడి కుటుంబసభ్యులకు తెలిసింది. మృతుడి భార్య సంగీత సోమవారం నాడు వాంకిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తిరుపతి మృతికి కారణ మైన ఐదుగురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

### గుట్టుచప్పుడు కాకుండా

## గుడుంబా సరఫరా

### నలుగురిపై కేసు నమోదు



**వేమనపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండలంలో గుడుంబా రవాణా చేస్తూ పట్టుబడిన, తయారు చేసిన, అమ్మిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యామ్ పటేల్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆల్గాం నుండి ముల్కలపేటకి గుడుంబా రవాణా జరుగుతుందని పక్కా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. ముసలమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో రాచర్ల నుండి ముల్కలపేట వైపు ఇద్దరు యువకులు కాలేజీ బ్యాగులు వేసుకుని వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 40 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. కుమ్మరి సాయి కుమార్, కుమ్మరి శివతేజ అల్గామ్ కు చెందిన రామ్ టెంకి సమ్మయ్య గుడుంబా తయారుచేసి ముల్కలపెటలోని గుడిపల్లి ముత్తక్కకు సరఫరా చేస్తున్నానని చెప్పడంతో రవాణా చేసిన, అమ్మిన, తయారు చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి గుడుంబా స్వాధీనం చేసుకొని బైక్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా గుడుంబా తయారు చేసిన, రవాణా చేసిన, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో

## ఆటో డ్రైవర్ మృతి

**మందమర్రి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ఎస్. రాజశేఖర్ తెలిపారు. తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన గోమాస తిరుపతి వయస్సు 29 సంవత్సరాలు వృత్తి రీత్యా ఆటో డ్రైవర్ తన స్నేహితుడైన గువ్వల కిషోర్ తో కలిసి ప్రయాణికులు కిరాయి నిమిత్తం మంచిర్యాలకు వెళ్లారు. మంగళవారం రాత్రి సమయంలో ఆటోలో తాండూరు కు వస్తుండగా మార్గమధ్యలో మందమర్రి మండలం అందుగుల పేట శివారులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలోకి వెనుక నుండి వేగంగా వచ్చిన ఒక లారీ వారి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న గోమాస తిరుపతి, గువ్వల కిషోర్‌కు గాయాలయ్యాయి. తిరుపతికి తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుండి కరీంనగర్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## మద్యం తాగిన డ్రైవర్‌పై కేసు

**తలమడుగు, జూలై 9 (ప్రభాత సమాచారం)**

డ్యూటీలో ఉండగా మద్యం తాగిన ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ కుడిమేత శంబాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ కుడిమేత శంబాజీ జిల్లాకేంద్రం నుంచి తాంసి మండలం అంబుగాం, గిరిగాం గ్రామాల విద్యార్థులను తీసుకొని వస్తూ సుంకిడి గ్రామ సమీపంలోని వైన్స్‌లో మద్యం తాగాడు. స్థానికులు గమనించి శంబాజీని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని డ్రైవర్ శంబాజీపై కేసు నమోదు చేశారు.

### పథకం ప్రకారమే

## రూ.50 లక్షలు లూటీ

### 9 మంది అరెస్టు, పరారీలో ఐదుగురు నిందితులు

**మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

సీఎస్ఆర్ పేరిట పథకం ప్రకారం రూ.50 లక్షలు లూటీ చేసిన కేసులో మలక్పేట పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. మరో అయిదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి రూ.6.94 లక్షల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మలక్పేట ఠాణా ఇన్స్పెక్టర్ పిడమర్తి నరేశ్ కథనం ప్రకారం.. సినిమాలు, యూట్యూబ్ వీడియోల ద్వారా ప్రేరణ పొందిన 14 మంది మూడు బృందాలుగా ఏర్పడ్డారు. ఒక బృందంతో.. మరో బృందానికి సంబంధం లేనట్లు వ్యవహరిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఓల్డ్ బోయినపల్లికి చెందిన నిమ్మల రవీందర్ గౌడ్ (54), సికింద్రాబాద్కు చెందిన కొల్లి లింకన్ బాబు (37), రంగారెడ్డి జిల్లా తొర్రూరు చెందిన పిన్నిటి నవీన్రెడ్డి అలియాస్ శ్రీకాంత్ (37), ఈదీ బజార్కు చెందిన సయ్యద్ దస్తగీర్ ఖాద్రీ అలియాస్ ఇషాన్ (23), బోయినపల్లికి చెందిన గజ్జెల్లి విజయ్ చంద్ర(30), మాదన్నపేటలో ఉండే దర్శనం మురళి (32), చందానగర్కు చెందిన అశోక్ గౌడ్ (45), సైదాబాద్ నివాసి అవులే రాము (27), విశాఖపట్నం గాజువాక నివాసి ఈగల రమణ(47), ఎంఎస్కే బిమోహన్ అలియాస్ వహీద్, సమీర్ అలియాస్ సల్మాన్, అయాజ్ దేశముఖ్(పూణె), సాహిల్ అలియాస్ షబాజ్, గుర్తు తెలియని వ్యక్తి.. సులువుగా డబ్బు సంపాదించేందుకు బృందాలుగా ఏర్పడ్డారు. మంచిర్యాలకు చెందిన సేవారత్ ట్రస్ట్ నిర్వాహకుడు విజయ్కుమార్ను కలిసి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద నిధులు వచ్చేలా ఏర్పాటు చేస్తామని నమ్మకం కలిగించారు. రూ.6 కోట్ల నకిలీ బ్యాంక్ ఖాతా వివరాలు చూపించారు. ట్రస్ట్ ఖాతాలో రూ.కోటి జమ చేస్తామని, రూ.50 లక్షలు నగదుగా ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన విజయకుమార్ నగదు సిద్ధం చేసుకొని.. ఈ నెల 4న మూసారాంబాగ్ తన బంధువుల ఇంటి వద్ద ఉన్నాడు. నగదు తీసుకెళ్లేందుకు ఇద్దరు వ్యక్తులు రాగా.. అదే సమయంలో మరో బృందం 'టాస్క్ ఫోర్స్ పోలీసులుగా వచ్చి రూ.50 లక్షలు దోచేసి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు.

## ప్రైవేటు ఉద్యోగి బలవన్మరణం

**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి బాలకృష్ణ పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బుధవారం స్థానిక ఏరోడ్రోమ్ మైదానంలో పురుగుమందు తాగి పడి ఉండగా పోలీస్ పెట్రోలింగ్ వారికి సమాచారం అందడంతో అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలకృష్ణ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా

**మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

## రంగంలోకి స్పెషల్ పార్టీ పోలీసులు

జిల్లా కేంద్రంలో పోలీసులు నిఘా కట్టు దిట్టం చేశారు. ఎలాంటి అవంచనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా ప్రత్యేక బృందలతో పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో రౌడీ షీటర్స్, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం అర్ధరాత్రి 50 మంది స్పెషల్ టీం పోలీసులతో పట్టణంలోని పలు కాలనీలు జల్లెడ పట్టారు. అనుమానితులు, మద్యం తాగి వాహనం నడిపే వారి ని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు.గతం లో పలు కేసుల్లో నేరస్థులు గా ఉన్న వారి వివరాలు సేకరించి వారి ఇంటికి వెళ్లి ప్రస్తుత వారి స్థితి గతుల పై ఆరా తిశారు.పద్ధతి మార్చుకోవాలని లేకపోతే పిడి యాక్ట్, నగర బహిష్కరణ లాంటి చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఘాటు గా హెచ్చరించారు. రౌడీ షీటర్లు, అనుమానితులు నిత్యం అందుబాటులో ఉండాలని వేరే ఇతర గొడవల్లో తల దూర్చా కూడదని సూచించారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతు అల్లర్లు సృష్టించే వారు ఎంతటి వారు అయిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.శాంతి భద్రతల పరిరక్షణ లో భాగంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపట్టనున్నట్లు డీసీపీ తెలిపారు. అయన వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, సీఐ లు ప్రమోద్ రావు, ఆకుల అశోక్ కుమార్, ఎస్ఐలు తిరుపతి, కిరణ్, సిబ్బంది ఉన్నారు.





## ట్రిపుల్ ఐటీలో ముగిసిన కౌన్సెలింగ్

**ముథోల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

బాసర ట్రిపుల్ ఐటీ మహబూబ్‌నగర్ సెంటర్లకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను తొలివిడత కౌన్సెలింగ్ బుధవారం ముగిసింది. మూడవ రోజు ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్‌లు కౌన్సెలింగ్ ప్రారంభించారు. రెండు సెంటర్లలో కలిపి 1690 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 1472 మంది విద్యార్థులు హాజరయ్యారు. గైర్హాజరైన విద్యార్థుల స్థానాలను త్వరలోనే వెయిటింగ్ లిస్టు ఆధారంగా భర్తీ చేస్తామని క్యాంపస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ బాసర క్యాంపస్ పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు.

## బిఆర్ఎస్ మండల కన్వీనర్‌గా అంజన్న

**కాజ్‌నగర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండలం బీఆర్ఎస్ కన్వీనర్‌గా పార్వతి అంజన్నను బుధవారం ఆ పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రత్యక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేద్దామని సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్ రావు అన్నారు.



# అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం



**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

అమృత్ 2.0 స్కీమ్‌కు సంబంధించిన నీటి సరఫరా అభివృద్ధి పనులు ఎస్టీపీల నిర్మాణం పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంఎల్ఎ పాయల్ శంకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వినోద్ కుమార్, ఎంఆర్డీఓ శ్రీనివాస్ యు, ఎంఆరీ ఇఇ పబ్లిక్ హెల్త్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇఇ ఎంఎ, మున్సిపల్ డిప్యూటీ ఇఇ సంబం ధిత ఏజెన్సీ అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ , ఎమ్మెల్యే మాట్లాడుతూ అమృత్ పథకంపై మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అమృత్ స్కీమ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి సరఫరా, మురుగు నికాస, పట్టణ గ్రీన్ పరిసరాలు, రోడ్ల వంటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రతి ప్రాజెక్టు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, సమయపాలనతో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయాలని సూచించారు.

# విద్యుత్ ఉద్యోగుల నిరసన, ధర్నా

**మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కేంద్రప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం మంచిర్యాలలో విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్, రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మంచిర్యాలలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు, సిబ్బంది ఈ నిరసన చేపట్టారు. మంచిర్యాల సర్కిల్ జేఏసీ చైర్మన్ బొమ్మ సత్తిరెడ్డి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని విద్యుత్ ఉద్యోగులు కేంద్రం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ అంశం లో అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ 220 రోజులుగా కుటుంబ సమేతంగా సమ్మె చేస్తున్నారని, వారికి మద్దతుగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో కేంద్రం విద్యుత్ సంస్థలను ప్రైవేట్ చేయాలని చూస్తే రాష్ట్ర జేఏసీ పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సర్కిల్ జేఏసీ కన్వీనర్ రమేశ్, కోచైర్మన్ జాడి విలాస్, కోకన్వీనర్ నూక రాజశేఖర్, ఎస్ఈ ఉత్తమ్‌జాడే, జేఏసీ నాయకులు దుండె కొండయ్య, అబ్దుల్ ఖలీమ్, రాచకొండ వెంకటేశ్వర్లు, శరత్, సాయిక్రిష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.






## విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం

**ఇచ్చోడ, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మండల కేంద్రంలోని రంజాన్‌పూర కాలనీలో బుధవారం విద్యుదాఘాతంతో ముబిన్‌ఖాన్‌కు చెందిన కిరాణ దుకాణం దగ్ధమైంది. ఉదయం దుకాణంలో నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ముబిన్‌ఖాన్‌కు సమాచారం ఇచ్చారు. అతను వచ్చి దుకాణం తెరిచేలోపే రూ.లక్షా 20 వేల విలువైన సరుకులు దగ్ధమయ్యాయి. ఆర్ఎస్ఐ హుస్సేన్ సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

## చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు



**పెంబి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

పెంబి మండలంలోని నాగాపూర్ గ్రామ సమీపంలో బుధవారం ఖానాపూర్లోని కేరళ మోడల్ స్కూల్ బస్సు స్టీరింగ్ పని చేయక చెట్టును ఢీకొట్టింది. ఖానాపూర్ నుంచి పెంబి, మందపల్లి గ్రామాలకు స్కూల్ పిల్లలను తీసు కొస్తున్న క్రమంలో నాగాపూర్ గ్రామ శివారులో చెట్టును ఢీకొంది. స్కూల్ బస్సులో 20 మంది విద్యార్థులు ఉండగా పలువురికి స్వల్పంగా, మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఖానాపూర్, నిర్మల్ ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు.

## ఇసుక లారీ స్వాధీనం

**బోథ్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

బోథ్ మండల కేంద్రంలో ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు తెలిపిన వివరాలు.. నిర్మల్ జిల్లా సోఫీనగర్ నుంచి ఇసుక లారీ అనుమతి లేకుండా, రాయల్టీ చెల్లించకుండా బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మాజిద్ అనే వ్యక్తి మండల కేంద్రానికి చెందిన ఇజాజ్ అనే వ్యక్తికి 40 టన్నుల ఇసుక తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



## ప్రాజెక్టులో యువకుడి మృతదేహం లభ్యం

**తాంసి, జూలై 9 (ప్రభాత సమాచారం)**



మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టులో చేపలు పట్టడానికి వచ్చి గల్లంతైన యువకుడి మృత దేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బొక్కలగూడ కాలనీకి చెందిన అద్దెల రఘు (24) తన స్నేహితుడితో కలిసి సరదాగా ప్రాజెక్టు వద్దకు మంగళవారం చేపలు పట్టడానికి వచ్చారు. చేపలు పట్టే క్రమంలో ప్రాజెక్టు గేట్ల సమీపంలో రఘు ఒక్కసారిగా అదుపు తప్పి నీటిలో పడిపోయి గల్లంతయ్యాడు. తన స్నేహితుడు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం నీటిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి సోదరుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రణయ్ కుమార్ తెలిపారు.

## పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

**దండేపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**



కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దండేపల్లిలోచోటు చేసుకుంది. ఎస్సై తహసీ నోద్దీన్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం నెల్కి వెంకటపూర్ గ్రామానికి చెందిన కోవ మహేందర్ (19) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. మద్యానికి బానిసైన మహేందర్ కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చూపించగా మద్యం మానేసి, మందులు వాడితే కడుపునొప్పి తగ్గుతుందని వైద్యులు చెప్పిన తాగుడు మనలేదు. దీంతో తాగు చనిపోతానంటూ లక్ష్మణ్‌కు చెప్పాడు. తరువాత మహేందర్ దండేపల్లి వాగులో పురుగుల మందు తాగి స్నేహితుడు శేఖర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వారు అక్కడకు చేరుకుని మహేందర్‌ను లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగరకు తరలించగా పొందుతూ రాత్రి మృతి చెందాడు.

# విద్యుత్ ఉత్పత్తిలో ఎస్టీపీపీని అగ్రగామిగా నిలపాలి

**జైపూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ) ను దేశస్థాయిలో అగ్రగామిగా నిలపాలని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ పీపీని బుధవారం ఆయన సందర్శించారు. బాయి లర్లలో సీఅండ్ కంట్రోల్స్ ద్వారా రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, టర్బైన్ పనితీరును అధికారులు వివరించారు. ఎస్టీపీపీ నమూనా ద్వారా ఆయా విభాగాల్లో యంత్రాల పనితీరు, విద్యుత్ ఉత్పత్తి అంశాలు తెలియ జేశారు. నూతనంగా చేపట్టిన ఎఫ్జీడీ పనులు, అన్యువల్ ఓవర్లింగ్ పనులను వివరించారు. 800మెగావాట్ల కొత్త ప్లాంటు నిర్మించే ప్రాంతాన్ని సంద ర్శించారు. అనంతరం సోలార్ ప్లాంటును పరిశీలించి పనితీరు తెలుసుకున్నారు. సాయంత్రం అడ్మిన్ భవన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగుల ఉత్తమ పనితీరు ఫలితంగా వరుసగా 53 అవార్డులు అందు కోవడం అభినందనీయమన్నారు. గౌతమ్‌ను అధికారులు, ఉద్యోగుల సంఘాల నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసిం హారావు, వోఅండం చీఫ్ జెన్సింగ్, సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏజీఎంలు మురళీధర్, మదన్మోహన్, శ్రీనివాస్, డీజీఎం అజజుల్లాఖాన్, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్



## పార్టీ బలోపేతానికి అందరు కలిసికట్టుగా పనిచేయాలి

### టీపీసీసీ ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్



**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరు కలిసికట్టుగా పనిచేయాలని టీపీసీసీ ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయన బుధ వారం హైదరాబాద్‌లో గాంధీ భవన్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. కార్య క్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణ, రియాజ్, నరేష్, విశ్వప్రసాద్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన ఉమ్మడి ఆదిలాబాద్ నేతలు



**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర మంత్రి సీతక్కను ములుగులో బుధవారం ఆది లాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలు కలిశారు. ఈ సంద ర్భంగా ఆమెకు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలిపే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి సీతక్క సూ చించినట్లుతెలిపారు. నాయకులు ప్రఫుల్ రెడ్డి, ధర్మపురి చంద్రశేఖర్, రహీం ఖాన్, నవీన్ రెడ్డి ఉన్నారు.

## విద్యా వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయండి



**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక తరగతులను ఈ నెల 12, 13 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సిడం సాయికుమార్ తెలిపారు. బుధవారం ఆదిలాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర తరగతులకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయవృద్ధికి తరగతులు దోహదపడతాయన్నారు.

## వివాహిత అదృశ్యం

**ముథోల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ఓ వివాహిత (22) అదృశ్యమైనట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. ఓ గ్రామానికి వివాహిత మంగ ళవారం మధ్యాహ్నం పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆచూకీ కోసం బంధువులు, తెలిసి నవారి ఇళ్లలో గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఆమె భర్త రవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రాణహిత పరవళ్లు



**కౌటాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మహారాష్ట్రలో ఎగువన కురుస్తున్న వర్షాలకు కౌటాల మండలంలోని తుమ్మిడి హెటి వద్ద గల ప్రాణహిత నదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాణహిత నది పరవళ్ళు తొక్కుతోంది. బుధవారం ఉదయం పుష్కర ఘా టును తాకుతూ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుండి ఇప్పటివరకు నదిలో ఇంత భారీగా వరద నీరు రావడం ఇదే మొదటిసారి. కౌటాల మం డలంలో ఇప్పటివరకు ఎక్కడ కుంటలు, చెరువులు నిండిన దాఖలాలు లేవు. దీంతో నదిలోని వరద ప్రవాహాన్ని చూసేం దుకు మండలవాసులు ప్రాణహిత పుష్కర ఘాట్ వద్దకు వెళ్లి తిలకిస్తున్నారు. పరవళ్లను చూసి పరవశించిపోతున్నారు.

## పర్సు పోలీసులకు అప్పగింత

**కుభీర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి దొంతుల పుష్ప అనే మహిళ నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భైంసా వెళ్లేందుకు దొంతుల పుష్ప అనే మహిళ మండల కేం ద్రంలోని బస్టాండ్కు వచ్చారు. అక్కడ ఆమెకు ఒక పర్సు దొరి కింది. అందులో రూ.24,416ల నగదు, వెండి కాళ్లగజ్జలు (ఒక జత), ఇద్దరు మహిళలు, ఒక పిల్లడి ఫొటోలు ఉన్నాయి. ఒక ఫొటోపై యువతి పేరు కవిత అని రాసి ఉంది. కాగా దొంతుల పుష్ప దొరికిన పర్సును తన భర్త దత్రాత్రితో పోలీస్ స్టేషన్‌కు పంపించి నిజాయితీ చాటుకున్నారు. భర్త పర్సును ఎస్సై కృష్ణారెడ్డికి అప్పగించారు. డబ్బు పోగొట్టుకున్న వారు ఆధారాలు చూపి డబ్బు తీసుకుపోవచ్చని ఎస్సై తెలిపారు.





## మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలి

**నిర్మల్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ప్రతి విద్యార్థి మొక్కలు నాటి దాన్ని బాధ్యతగా పెంచి పర్యావరణంలో భాగస్వాములు కావాలని జిల్లా క్రీడలు యువజనుల సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడి యంలో విద్యార్థులు కలిసి మొక్కలు నాటి ర్యాలీ నిర్వ హించారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనా లను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధి కారులు రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**ఆసిఫాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షులు కా ర్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌ని డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చరణ్, మాజీ ఆసిఫాబాద్ ఎంపీపీ బొమ్మాన బాలేష్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కలిమ్ పాల్గొన్నారు.

## మడేలమ్మ తల్లి బోనాల జాతర

**చెన్నూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో రజక కులస్తుల కులదైవం, ఇలవేల్పు మడే లమ్మ జాతరను అంగరంగ వైభవంగా జరు పుకున్నారు. ఈ సందర్భంగా రజక కులస్తులు రజక కాలనీ నుండి బో నాలు, డప్పులు, డిజె సౌండ్ సిస్టంలతో నృ త్యాలు చేస్తూ, శివసత్తుల పూనకాలతో పట్టణంలోని ప్ర ధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తూ మడేలమ్మ తల్లి ఆలయం వరకు యాత్ర కొనసాగించారు. అనంతరం రజక సం ఘం అధ్యక్షుడు నిమ్మల వెంకటరాజం ఆధ్వర్యం లో ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# బెల్ట్ షాపులను నిర్వహిస్తే ధ్వంసం చేస్తాం

- రూ.50వేల జరిమానా
- గ్రామంలో బెల్ట్ షాపులను మూసివేయించిన మహిళా సంఘాలు
- ఇంద్రవెల్లి మండలం వడగాం గ్రామ మహిళా సంఘాల తీర్మానం



**ఇంద్రవెల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వడగాం గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు తొల గించాలని మహిళా సంఘాలు తీర్మానం చేశాయి. గురువారం మండలంలోని వడగాం గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపును మహి ళా సంఘాల ఆధ్వర్యంలో బెల్ట్ షాపుల నిర్వ హకులను హెచ్చరించి షాపులు బంద్ చేయించారు. ఇక నుంచి వడగాం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బెల్ట్ షాపు నిర్వహిస్తే మహిళా సంఘాల ఆధ్వర్యంలో దుకాణాలపై దాడులు నిర్వహించి ధ్వంసం చేసి రూ. 50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తున్నారని మహిళలు ఆరోపించారు. దీంతో గ్రామీణ యువత మద్యానికి అలవాటు పడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహజన్ దృష్టి సారించి గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులను తొల గించాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులు ఆత్రం భీమ్ బాయి, విజయలక్ష్మి, దేవి, కలబాయి, రత్తుబాయి, నీలబాయి, ఉమాబాయి, లక్ష్మిబాయి, కౌసుబాయి, సీతాబాయి, దేవు బాయి, రూపాబాయి, లచ్చుబాయి, సోంబాయి పాల్గొన్నారు.



# పల్లెల్లో 'స్థానిక' సందడి

- పల్లెల్లో మళ్లీ ఎన్నికల కోలాహలం.. ▪ ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషను నోటిఫికేషన్
- గ్రామ పంచాయతీల పరిధి కూడా ఖరారు ▪ ఉత్తర్వుల జారీతో మొదలైన రాజకీయ సందడి
- ఈ నెల 8 నుంచి 12వ తేదీలోగా ప్రక్రియ పూర్తి ▪ పట్టణాలు విడిచి గ్రామాల బాటపట్టిన ఆశావహులు
- ఓటర్లకు పలకరింపులు, ఆర్థిక సహాయాలు ▪ రిజర్వేషన్లలో మార్పు నేపథ్యంలో తీవ్ర ఉత్కంఠ

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఉన్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ శ్రీజన ఆయా జిల్లాల కలె కరకు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 8వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చి 9న అన్ని గ్రామ మండల జిల్లా స్థాయిలో సమాచారం ఉంచాలని ఆదేశాలు ఇచింది. 10వ తేదీ లోపు అభ్యంతరాలు స్వీకరించి 12న తుది డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించిన ఉత్త ర్వులను దారి చేయాలని ఆదేశాలు జారీ అ య్యాయి. ఈ ప్రక్రియ ప్రారంభం అయింది అంటే ఎన్నికల నోటిఫికేషన్ కూడా త్వరలోనే వెలువడే అవకాశాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న పట్టుదలతో ఉన్న రాష్ట్ర ప్రభు త్వం తాజాగా మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేస్తున్నది. గతంలో ఉన్న మండలాలకు అదనంగా ఈ సారి ప్రతి జిల్లాలో కనీసం 10 నుంచి 20 మండలాలు పెరిగిన నేపథ్యంలో అన్ని మండలాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈసారి భారీగా పెరిగిన మండలాలు పెరిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబం ధించి గతంలో 52 మండలాలు మాత్రమే ఉండేవి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను నాలుగు జిల్లాలుగా విభజించిన తర్వాత జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. గతంలోనే పెరిగిన మం డలాలకు సైతం ఎన్నికలు జరగగా.. తాజాగా మరిన్ని మండలాలు పెరిగాయి. వాటికి సైతం ఈ సారి ఎన్నికలు జరగనున్నాయి. గతంలో కొన్ని మండలాల్లో మూడు నుంచి నాలుగు ఎంపీటీసీ స్థానాలు మాత్రమే ఉండగా మరికొన్ని మండలాల్లో పదికి పైగా ఉ న్నాయి. అయితే ప్రభుత్వం మండలాల పరిధిలో ఉండే మండల ప్రాదేశిక నియోజకవర్గం డీలిమిటే షన్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ప్రాతిపదికన ప్రతి మండ లంలో ఐదు తగ్గకుండా మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలు ఉండనున్నాయి. గతంలో ఉమ్మడి జిల్లాలో 52 మండలాలు ఉండగా తాజాగా మరో 22 మండలాలు పెరిగాయి. దీంతో రాజకీయ పార్టీల నేతల్లో అధికార హోదా దక్కించుకునే పెరుగుతున్నాయి.

## నోటిఫికేషన్ జారీతో పార్టీల్లో హుషారు..

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఉన్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల డీలిమిటేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పంచా యతీరాజ్ శాఖ డైరెక్టర్ శ్రీజన ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. స్థానిక సంస్థలు ఎన్నికల నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో మండలాల సంఖ్య పెంపుదలతో పాటు గ్రామ పంచాయతీల విభజన నేపథ్యంలో తాజాగా ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషన్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 8వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చి 9వ తేదీన అన్ని గ్రామ మండల జిల్లా స్థాయిలో సమాచారం ఉంచాలని ఆదేశాలు ఇచ్చింది. 10వ తేదీలోపు అభ్యంతరాలు స్వీకరించి 12వ తేదీన తుది డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ప్రక్రియ ప్రా-ంభం అయింది. అంటే ఎన్నికల నోటిఫికేషన్ కూడా త్వరలోనే వెలువడే అవకాశాలున్నాయి. ముందుగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయని భావించినప్పటికీ తాజాగా జరుగుతున్న దీన్నిబట్టి మండల జిల్లా పరిషత్ ఎన్నికలే ముందుగా జరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీంతో రాజకీయ పార్టీల్లో కొత్త హుషారు మొదలైంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల్లో పోటీపడి ఎందుకు ఎంపీటీసీ, మం డల వైస్ ప్రెసిడెంట్,మండల్ ప్రెసిడెం ట్, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీ వైస్ చైర్మన్, మండల, జెడ్పీ కోఆప్షన్ సభ్యుల వంటి పద వులు దక్కించుకునేందుకు నేతలు పావులు కదుపుతున్నారు.

---

### కథ:

ఈ కథ 1980లలో నడుస్తూ ఉంటుంది. జాక్ (అనునాథ్) శిబూ (సిద్ధార్థ్) వరుణ్ (రిషి) షాజీ (మనోజ్) సుదీప్ (ప్రేమ్) అరుణ్ (సుజిత్) ఒకే విలేజ్ కి చెందిన కుర్రాళ్లు. ఒకే కాలేజ్ లో వీళ్లంతా చదువుతూ ఉంటారు. అయితే చదువుపై కంటే కూడా సరదాగా తిరగడం పైనే ఫోకస్ పెడుతుంటారు. ఈ క్రమంలోనే ఆ ఊళ్లో జరిగిన ఒక కార్యక్రమంలో సిటీ నుంచి వచ్చిన కొందరు కుర్రాళ్లు డాన్స్ చేస్తారు. యూత్ లో డాన్స్ కి ఉన్న క్రేజ్ చూసిన తరువాత, తాము కూడా నేర్చుకోవాలని వీళ్లంతా అనుకుంటారు. ఇంట్లో వాళ్ల వైపు నుంచి ఈ కుర్రాళ్లకి ఎలాంటి సపోర్ట్ లభించకపోయినా, అందరూ తమకున్న వనరులని ఉపయోగించుకుంటూ ప్రాక్టీస్ చేయడం మొదలుపెడతారు. యూత్ పై మైఖేల్ జాక్సన్ ప్రభావం ఎక్కువగా ఉండటం .. ఆయన 'మూన్ వాక్' కి విపరీతమైన క్రేజ్ ఉండటంతో తమ టీమ్ కి 'మూన్ వాకర్స్' అనే పేరు పెట్టుకుంటారు. 'మూన్ వాక్'ను స్పెషల్ ఐటమ్ గా చేయాలని నిర్ణయించుకుంటారు. ఈ నేపథ్యంలోనే ఈ టీమ్ లోని జాక్ తల్లి, చదువుకోమంటూ అతణ్ణి కట్టడి చేస్తుంది. ప్రేమించిన అమ్మాయి బ్రదర్ తో తన్నులు తిని, వరుణ్ ఆస్పత్రి పాలవుతాడు. మిగతా కుర్రాళ్లు పోలీసుల కంటపడటంతో, వాళ్ల జుట్టు కత్తిరించి వదిలేస్తారు. ఇలాంటి పరిస్థితులలో ఆ యువకులు ఏం చేస్తారు? 'మూన్ వాకర్స్'గా పేరు తెచ్చుకోవాలనే వాళ్ల ప్రయత్నం ఫలిస్తుందా? అనేది కథ.



### విశ్లేషణ:

1980 కాలం నాటి కథ. ఆరుగురు కాలేజ్ కుర్రాళ్లపై మైఖేల్ జాక్సన్ తీసుకొచ్చిన బ్రేక్ డాన్స్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దాంతో వాళ్లు డాన్స్ నేర్చుకోవాలని అనుకుంటారు. ఇటు ఇంట్లోవాళ్లు .. అటు కాలేజ్ లోని వాళ్లు ఎంకరేజ్ చేయకపోయినా ఎలా తమ కోరికను నెరవేర్చుకున్నారు? తాము అనుకున్నది సాధించారు? అనే కథను ఆనాటి వాతావరణ పరిస్థితులకు తగినట్టుగా ఆవిష్కరించాడు. కాలేజ్ ఏజ్ లోకి అడుగుపెట్టగానే, ట్రెండ్ ను ఫాలో అవ్వడానికి యూత్ ప్రయత్నిస్తూ ఉంటుంది. ఏదైనా కొత్తగా చేయాలని, అందరూ తమవైపు గొప్పగా చూడాలని కోరుకుంటారు. ఆ సమయంలో ఫ్రెండ్‌షిప్ చాలా బలంగా ఉంటుంది. అలాగే ఆకర్షణలు .. ప్రేమలలో కూడా కదలిక మొదలవుతూ ఉంటుంది. అలాంటి సన్నివేశాలతో ఈ కథను కనెక్ట్ చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడని చెప్పాలి. విలేజ్ నేపథ్యం .. కాలేజ్ లైఫ్ .. ఫ్రెండ్స్ .. లవర్స్ .. పేరెంట్స్ .. ఎనిమీస్ .. ఇలా అన్ని వైపుల నుంచి ఈ కథ సహజత్వానికి చాలా దగ్గరగా నడుస్తుంది. ప్రధానమైన పాత్రలను డిజైన్ చేసిన తీరు .. తెరపై ఆవిష్కరించిన విధానం బాగున్నాయి. అయితే డాన్సు ప్రాక్టీస్ లు .. స్టేజ్ పై డాన్సులకు సంబంధించిన నిడివిని కాస్త తగ్గించి, లవ్ ట్రాక్ లకు సంబంధించిన నిడివిని మరికాస్త పెంచితే బావుండేదేమో అనిపిస్తుంది.

### ముగింపు:

తక్కువ బడ్జెట్ లో గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఇంట్రెస్టింగ్ కంటెంట్ ఇది. 1980 కాలానికి చెందిన యూత్ ను మరోసారి ఆ కాలంలోకి తీసుకుని వెళుతుంది. టాలెంట్ ఎవరి సొత్తూ కాదు .. సాధన చేసేవారిని విజయం వెదుక్కుంటూ వస్తుందనే సందేశాన్ని అందించిన సినిమా ఇది.

# అలరించిన మూన్ వాక్

ఈ మధ్య కాలంలో యూత్ నుంచి మంచి మార్కులు కొట్టేసిన సినిమా 'మూన్ వాక్'. లిజో జోస్ పెల్లిస్సేరి దర్శకత్వం వహించిన ఈ సినిమా, 2020లోనే షూటింగును పూర్తిచేసుకుంది. కొన్ని కారణాల వలన ఆలస్యమవుతూ, ఈ ఏడాది మే 30వ తేదీన థియేటర్లకు వచ్చింది. దాదాపు కొత్తవాళ్లు నటించిన ఈ సినిమా, మంగళవారం ఓటీటీలోకి అడుగు పెట్టింది. ఈ కథ ఎలా ఉందో రివ్యూలో చూద్దాం.




### నటీనటుల పనితీరు:

1980 కాలం నటి వాతావరణాన్ని .. అప్పటి యూత్ స్వభావాన్ని ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంటుంది. కొత్తవాళ్లే అయినా కుర్రాళ్లంతా బాగా చేశారు. అన్వర్ షా ఫొటోగ్రఫీ .. ప్రశాంత్ పిళ్లై నేపథ్య సంగీతం .. దీపు జోసెఫ్ ఎడిటింగ్ ఓకే.








# సార్వత్రిక సమ్మె విజయవంతం

## కదంతొక్కిన కార్మిక లోకం

- కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై అగ్రహం
- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్..
- వాడ వాడలా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు
- నినాదాలతో దద్దరిల్లిన ప్రధాన చౌరస్తాలు

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకర ణను ఉపసం హరించుకోవాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, జీవో 49ని రద్దు చేయాలని, పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దేశ వ్యాప్త సమ్మె జిల్లాలో విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున కార్మికులు కదిలి వచ్చి ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద మహాధర్నా చేపట్టారు.

























# తుమ్మిడిహెట్టి వద్ద నీరు లేదనడం సరికాదు



## ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

**కౌటాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే తగినంత నీరు లేదని చెప్పడం సరికాదని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహించి పుష్కరఘాట్‌లకు తగలడంతో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా 200 టీఎంసీలకు తక్కువ కాకుండా నీటి లభ్యత ఉన్నా గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దోచి పెట్టడానికే కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన తరువాత తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పునరుద్ధరిస్తామని తెలిపారని అన్నారు. ఇప్పటి వరకు డీపీఆర్ కూడా సిద్ధం చేయలేదని చెప్పారు. ఈ రోజు సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారని, తుమ్మిడిహెట్టి వద్ద ఉన్న నీటి ఉధృతిని వారికి తెలియజేయడానికి ఈ ప్రాంతాన్ని సందర్శించి వారికి లైవ్ వీడియో ద్వారా సందేశాన్ని పంపించానని తెలిపారు. వెంటనే సమగ్ర రిపోర్టు తయారు చేసి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మిస్తే ప్రాణహిత నుంచి చేవెళ్ల వరకు నీటిని మళ్లించవచ్చని తెలిపారు. ఎల్లంపల్లి వరకు కేవలం గ్రావిటీ ద్వారా నీటిని తరలించి ఎల్కలంపల్లి నుంచి ఇప్పుడున్న లిఫ్టలను ఉపయోగించుకుంటే సరిపోతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వచ్చే ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభువం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, విజయ్, మోతిరాం పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

**సాగు విస్తీర్ణం పెంచాలి కలెక్టర్ రాజర్షిషా**
**వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో సమీక్ష**




**ఆదిలాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగుకు జిల్లా రైతులు ముందుకు రావాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు ద్వారా మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకంగా అనేక సబ్సిడీ పథకాలు అందిస్తున్నాయని తెలిపారు. జిల్లా రైతులు ఈ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ఆయా మండలాల్లో ఏవోలు సాగు లక్ష్యాలను రూపొందించి రైతులకు అవగాహన కల్పించాన్నారు. ఇందులో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, ఉద్యాన, పట్టు పరిశ్ర మశాఖ అధికారి సుధాకర్, మల్లేశ్వరరావు, వ్యవ సాయ విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

**'అమృత్ 2.0' పై సమీక్ష...**

పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి గాను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకం పురోగతిపై కలెక్టర్ రాజర్షిషా, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్తో కలిసి బుధవారం సమీక్షించారు. కలెక్టరేట్ చాంబర్ లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అమృత్ పథకం ద్వారా పట్టణంలో నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ, పచ్చదనం పెంపు, రహదారి నిర్మాణం వం టి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో చేపడుతున్న నీటి సరఫరా అభివృద్ధి పనులు, ఎస్టీపీ నిర్మాణ పనుల పురోగతిపై అధికారుల నుంచి నివేదికలు తీసుకున్నారు. ప్రతీ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పను లపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ సలోని, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# మంత్రి సీతక్క పుట్టినరోజు వేడుకలు

**జన్నారం, జూలై 9 (ప్రభాత సమాచారం)**

ప్రజల హితం కోరే ఉక్కు మహిళ మంత్రి సీతక్కని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. బుధవారం జన్నారంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంత్రి సీతక్క పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మంత్రి సీతక్కకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శులు ముజఫర్ ఖాన్, మాణిక్యం పాల్గొన్నారు.



### అట్టహాసంగా రాష్ట్ర స్థాయి

# ఫుట్ బాల్ పోటీలు



**రామకృష్ణాపూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ క్రీడా మైదానంలో బుధవారం అండర్-13 బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని 7 జిల్లాలకు చెందిన 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏసీపీ రవి హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవి మాట్లాడుతూ... క్రీడల వల్ల స్నేహభావం, ఐక్యత పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాల్గుణ, సిఐ శశిధర్ రెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూర్ ఎంఈవోపై విచారణ

**చెన్నూర్, జూలై 9 (ప్రభాత సమాచారం)**

మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణ మూర్తిపై డీటీఎఫ్ ఫిర్యాదు మేరకు విద్యాశాఖ అసి స్టెంట్ డైరెక్టర్ ఎల్. లలిత బుధవారం విచారణ చేపట్టారు. ఎంఈవో విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని, ఉపాధ్యాయుల సర్వీసు బుక్ రికార్డు పూర్తి చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నివేదిక డీఈవోకు నివేదించనున్నట్లు లలిత తెలిపారు.

# కన్నెపల్లి ఎంపీడీవో సరెండర్

**కన్నెపల్లి, జూలై 9 (ప్రభాత సమాచారం)**

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కన్నెపల్లి మండల ఎంపీడీవో టి. శంకర్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ నెల 5న సరెండర్ చేసినట్లు తెలిసింది. గత యేడాది నవంబర్ 26న కన్నెపల్లి ఎంపీడీవోగా శంకర్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశాలకు గైర్హాజరు కావడంతోపాటు వన మహోత్సవం, స్వచ్ఛ భారత్ మిషన్, రాజీవ్ యువ వికాసం ఇందిరమ్మ ఇళ్లు, టెలీ కాన్ఫరెన్సుకు ముందస్తు సమాచారం ఇచ్చినా హాజరు కాలేదు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినా ఇవ్వకపోవడంతో క్రమశిక్షణ చర్యల కింద పీఆర్ అండ్ ఆ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఒక్కరోజు సమ్మెతో రూ.76 కోట్ల నష్టం

**మంచిర్యాల, జూలై 9 (ప్రభాత సమాచారం)**

సింగరేణిలో సుదీర్ఘకాలం తర్వాత సమ్మె సైరన్ మోగింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రీజియన్ లోని మందమర్రి, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్ లోని బొగ్గు బావులపై కార్మికులు బుధవారం స్వచ్ఛందంగా విధులను బహిష్కరించారు. ఒక్కరోజు సమ్మె వల్ల సింగరేణికి దాదాపు రూ.76 కోట్ల నష్టం వాటిల్లనుంది, ఉద్యోగులు వేతనాల రూపంలో రూ.13 కోట్ల 7 లక్షలు నష్టపోతారని యజమాన్యం ప్రకటించింది.

**1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం**

సింగరేణి వ్యాప్తంగా 22 ఓసీపీలు, 20 భూగర్భగనులు, డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న 42 వేల మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు విధులు బహిష్కరించారు. కార్మికులు రూ. 13.07 కోట్ల వేతనాలు కోల్పోయారు. శ్రీరాంపూర్‌లో 22 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది.

# వండర్ బుక్ అవార్డు విజేత సురేష్ కుమార్

**ఆసిఫాబాద్, జూలై 9 (ప్రభాత సమాచారం)**



ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ప్రఖ్యాత దర్శకుడు గౌరవ దండ నాయకుల సురేష్ కుమార్ జూలై 7న ప్రపంచ వండర్ బుక్ రికార్డ్ అవార్డు అందు కున్నారు. అనంతరం కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డు కూడా ఆయనను వరించింది. టెలివిజన్, సినిమా రంగాల్లో ఆయన చేసిన సేవలు, 50కి పైగా నంది అవార్డులు, అనేక పురస్కారాలు అందుకోవడం గర్వకారణం. ఈ సందర్భంగా బుధవారం కుమ్రంభీం జిల్లా సాంస్కృతిక సమాఖ్య తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.